



ఉదయగిరిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

అందరికీ దక్క లేదయ్యా!

- యూరియా కోసం రైతుల ఆవేదన
- గంటల్లోనే 400 బస్తాల విక్రయం
- దొరకని అన్నదాతల ఆగ్రహం

ఉదయగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతుసేవా కేంద్రం-2లో సోమవారం వ్యవసాయ అధికారులు రైతులకు యూరియా పంపిణీ చేశారు.దీంతో గత కొద్ది రోజులుగా యూరియా లేక అవస్థలు పడుతున్న అన్నదాతలు యూరియా కోసం బారులు తీరారు. అధికారులు ఓ ప్రణాళికబద్ధంగా పంపిణీ చేయలేదని, దీంతో అందరికీ దక్కలేదని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఉన్నతాధికారులు ఉదయగిరికి 18 టన్నుల(400 బస్తాలు) యూరియా కేటాయించారు. దీంతో అధికారులు పంపిణీకి శ్రీకారం చుట్టారు. పంపిణీలో నిబంధనలు పాటించకపోవడంతో రైతులకు అవస్థలు తప్పలేదు. రైతుల పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు ప్రామాణికంగా తీసుకుని తొలుత ఒక్కో రైతుకు రెండు బస్తాలు పంపిణీ చేశారు. అనంతరం రైతుకు ఒక్కొక్క బస్తా ఇచ్చారు.క్యూలో నిల్చున్న రైతులందరికీ యూరియా దక్కకపోవడంతో రైతుల మధ్య వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు కలుగజేసుకుని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యూరియా మళ్లీ వస్తుందని, అందరికీ పంపిణీ చేస్తామని తెలపడంతో వారు సద్దుమణిగారు. అధికారులు యూరియా పంపిణీని పది గంటలకు ప్రారంభించగా, మధ్యాహ్నం 3 గంటలకే 400 బస్తాల యూరియా అయిపోయింది. బస్తా రూ.266.50లు విక్రయించాల్సి ఉంది. అయితే అధికారులు రూ.280లు వసూలు చేశారని రైతులు మండిపడుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌ను వివరణ కోరగా రైతుల వద్ద నుంచి హమాలీల ఖర్చు వసూలు చేశామని, ఇది సర్వసాధారణమని సమాధానమిచ్చారు.


బ్లాక్‌లో విక్రయాలు



కొంతమంది రైతులు నిబంధనలకు విరుద్ధంగా అధిక బస్తాల యూరియా కొనుగోలు చేసి, అనంతరం బస్తా రూ.500ల చొప్పున ఇతరులకు విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం నుంచి క్యూలో నిల్చున్నా బస్తా యూరియా దొరకలేదని, కొందరు అధికంగా తీసుకెళ్లారని పలువురు రైతులు మండిపడ్డారు.

ఒకే అధికారి.. 4 పోస్టులు

- ఆర్‌అండ్‌బీలో చిత్రవిచిత్రాలు
- కోవూరు డీఈకి అదనంగా మూడు పోస్టులు
- ముక్కున వేలేసుకుంటున్న ఇతర అధికారులు



నెల్లూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఓ అధికారిని అదనపు బాధ్యతల కింద మరో పోస్టుకు ఇన్‌చార్జ్‌గా నియమించడం సర్వసాధారణం. అయితే ఒక అధికారికి ఒకటి కాదు, రెండు కాదు... ఏకంగా మూడు అదనపు పోస్టులు అప్పగించడం ఎప్పుడైనా విన్నారా..!? ఆ నాలుగు పోస్టులను ఏకకాలంగా నిర్వహించడం ఏ అధికారికైనా సాధ్యమా..?! కానీ ఆర్‌అండ్‌బీ శాఖలో మాత్రం ఈ చిత్రమైన పరిస్థితి ఇప్పుడు కనిపిస్తోంది. ఒక డీఈ స్థాయి అధికారికి ఏకంగా మూడు అదనపు పోస్టులు అప్పగించారు. ప్రస్తుతం అతను తన రెగ్యులర్ సీటుతో కలిపి మొత్తం నాలుగు పోస్టుల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇదెలా సాధ్యమన్న సందేహం కలిగితే... అందుకు సమాధానం ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులే చెప్పాలి.

కోవూరు డీఈగా వేణుగోపాల్ పనిచేస్తున్నారు. ఆయనకు నెల్లూరు ఈఈ, కావలి ఈఈ పోస్టులతోపాటు కావలి డీఈ పోస్టును కూడా అదనంగా అప్పగించారు. సుమారు నెల క్రితం నెల్లూరు ఈఈగా పనిచేస్తున్న మురళీకృష్ణ ఉద్యోగోన్నతిపై బదిలీపై వెళ్లారు. ఆ సమయంలోనే కావలి ఈఈగా పనిచేస్తున్న రామకృష్ణ ప్రసాద్ నెల్లూరు ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో డీఎస్ఈగా బదిలీ అయ్యారు. దీంతో ఆ పోస్టుల్లో ఎవరినీ నియమించలేదు. ఆ రెండు పోస్టుల ఇన్‌చార్జ్ బాధ్యతలను ఏకకాలంలో కోవూరు డీఈ వేణుగోపాల్‌కు అప్పగించారు. అలానే కావలి డీఈగా పనిచేస్తున్న చక్రధర్‌రావు ఇటీవల సెలవుపై వెళ్లారు. ఇప్పుడు ఆ పోస్టు ఇన్‌చార్జ్ బాధ్యతలను కూడా కోవూరు డీఈనే నిర్వహిస్తున్నారు. జిల్లాలో అనేకమంది అధికారులుండగా, ఈ ఒక్క అధికారికే ఎందుకు ఇన్ని ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నారో అర్థం కావడం లేదంటూ ఆర్‌అండ్‌బీ శాఖలోనే చర్చించుకుంటుండడం గమనార్హం. ఆర్‌అండ్‌బీలో ఓ ఈఈ స్థాయి అధికారి ప్రస్తుతం పోస్టింగ్ లేకుండా ఉన్నారని, ఆయనకు కూడా ఇవ్వడం లేదని మాట్లాడుకుంటున్నారు. మరి ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు ఏ ఉద్దేశ్యంతో ఇలా చేస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఒక అధికారిపై నాలుగు పోస్టుల పని ఒత్తిడి వేయడం కూడా మంచిది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా ఈ నాలుగు పోస్టుల విషయం తెలిసి ఓ సీఈ స్థాయి అధికారి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం. అలానే జిల్లాలోని ఇతర అధికారులు కూడా ఈ విషయం తెలిసి ముక్కున వేలేసుకుంటున్నారు. కాగా ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ ఎస్ఈ గంగాధరను వివరణ కోరగా నెల్లూరు, కావలి ఈఈల ఇన్‌చార్జ్ బాధ్యతలతోపాటు కావలి డీఈ ఇన్‌చార్జ్ బాధ్యతను కోవూరు డీఈ చూస్తున్నారని స్పష్టం చేశారు.



పొగాకు కొనుగోళ్ల ఆరంభం

వేలం కేంద్రాల పునఃప్రారంభం ● మేలురకానికి అనూహ్య ధర, లోగ్రేడ్ రేట్లలో కోత

కందుకూరు /మర్రిపాడు, కలిగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులు పరిమితికి మించి పండించిన పొగాకు విక్రయాలకు బోర్డు అనుమతించింది. దీంతో సోమవారం నుంచి వేలం కేంద్రాలు పునఃప్రారంభమయ్యాయి. కందుకూరు 1, 2 వేలం కేంద్రాలతో పాటు జిల్లాలోని కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాల్లో మేలురకం పొగాకుకు అనూహ్యంగా ధర లభించింది. లోగ్రేడ్ ధరలో మాత్రం వ్యాపారులు భారీగా కోత విధించారు. సోమవారం తొలిరోజే ఎఫ్1, ఎఫ్2 రకాలకు కిలోకు రూ. 315 ధర పెట్టి పోటీపడి కొనుగోలు చేసిన వ్యాపారులు లోగ్రేడ్‌లకు మాత్రం ధరను రూ. 120కి దిగజార్చారు.

మర్రిపాడులో..

మండలంలోని డీసీపల్లి వేలం కేంద్రంలో వాణిజ్యశాఖ ఆదేశాల మేరకు అపరాధ రుసుం లేకుండా 42.23క్వింటాళ్ల పొగాకు కొనుగోలు చేయనున్నట్లు, అంతకు మించి అమ్మితే రైతు నుంచి అపరాధరుసుం వసూలు చేయనున్నట్లు వేలం నిర్వహణాధికారి జీ. రాజశేఖర్ తెలిపారు. రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకు అంచనాతో బోర్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సోమవారం రైతులు 224 బేళ్లను తీసుకొని రాగా, 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని, 179 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 45 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర 315రూ కాగా, కనిష్ఠ ధర రూ120గా పలికింది.

● కలిగిరిలో...

స్థానిక వేలం కేంద్రంలో బోర్డు అనుమతించినదానికన్నా 10శాతం ఎక్కువ పొగాకు అమ్మకాల్లో ఒక శాతం, 10 నుంచి 20 శాతం అమ్మకాలకు 3శాతం, 20శాతం కన్నా ఎక్కువ అమ్మకాలకు 3శాతంతోపాటు కిలో పొగాకు రూ.1 వంతున అపరాధ రుసుం చెల్లించాల్సి ఉందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. అనధికార పొగాకు ఉత్పత్తిపై 6 శాతం సర్వీస్‌చార్జి, కిలోకు రూ.1 వంతున అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు.

ఐకమత్యంతో పోరాడి.. భూములు కాపాడుకుంటాం..!

- లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్

ఉలవపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐకమత్యంతో పోరాడి కరేడు భూములను కాపాడుకుంటామని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీఎస్ఆర్‌కేఆర్. విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన కరేడులో పర్యటించారు. తొలుత ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్థానికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టెంకాయచెట్లపాలెం, బట్టిసోమయ్యపాలెం మత్స్యకార గ్రామాల ప్రజల ప్రజాభిప్రాయాన్ని కూడా తెలుసుకున్నారు. అనంతరం కరేడులో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామానికి గుండెకాయ లాంటి కరేడు భూములు తీసుకున్నాక చుట్టుపక్కల గ్రామాల ప్రజల బతుకులు అధ్వానంగా మారుతాయని వాపోయారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అవలంబిస్తున్న ఏకపక్ష ధోరణిపై రైతులతో కలిసి పోరాడాలని నిర్ణయించుకున్నామన్నారు. ముందుగా చేవూరు, రావూరు గ్రామాల మధ్య ఇండోసోల్‌కు భూములు కేటాయించి, చివరి దశలో ఆ భూములను బీపీసీఎల్‌కు కేటాయించామని ప్రభుత్వం జీవోలో ప్రకటించడం స్థానిక ఎంపీ కాంట్రాక్టు కోసమేనని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆరోపించారు.

● భయభ్రాంతులకు గురిచేస్తున్న పోలీసులు

శుభకార్యాలకు, ఇతర ఫంక్షన్లకు బయట గ్రామాల నుంచి బంధుమిత్రులు గ్రామానికి రావాలంటే భయపడుతున్నారని, పోలీస్ 30 యాక్ట్ పెట్టి గ్రామంలోని వచ్చే ప్రతి వ్యక్తి ఐడెంటిటీని తనిఖీ చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కరేడువాసులు సభలో వాపోయారు. స్పందించిన విజయ్‌కుమార్ మాట్లాడుతూ మితిమీరిన బాధ్యతలతో ప్రజలను భయానికి గురిస్తే కోర్టుల్లో సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని పోలీసులను హెచ్చరించారు. పోలీస్ యాక్ట్ 30పై హైకోర్టులో విచారణ జరుగుతున్నదని త్వరలోనే విముక్తి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.



కరేడు గ్రామసభలో మాట్లాడుతున్న లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, వేదికపై వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు



జామాయిల్ కర్రను నరుకుతున్న కూలీలు

అసైన్డ్ భూముల్లో జామాయిల్ నరికివేత

- అడ్డుకున్న తిరుమలాపురం గ్రామస్థులు

- వివరాలు 8లో..



వ్యర్థాలతో కళారూపాలు 8

నానో ఎరువులు ఎంతో మేలు !

- రైతులకు అవగాహన అవసరం
- పెట్టుబడితోపాటు శ్రమ కూడా తక్కువే
- ఎక్కడికైనా ఇట్టే తీసుకెళ్లవచ్చు


టీకాల అమలులో పురోగతి

- లక్ష్యసాధనలో సత్ఫలితాలు ● 90 శాతం టార్గెట్లు పూర్తి

8



అడుగంటిన రాళ్లపాడు రిజర్వాయర్



సోమశిల జలాశయంలో సమృద్ధిగా నీరు

జలకళ.. వెలవెల

- ఉత్తరకాలువ ఆధునికీకరణలో నిర్లిప్తత
- చివరి ఆయకట్టుకు అందని సోమశిల జలాలు
- అడుగంటుతున్న రాళ్లపాడు

అనంతసాగరం సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సోమశిల జలాశయం కృష్ణాజలాలతో జలకళను సంతరించుకుంది. రాళ్లపాడు రిజర్వాయర్ నీరులేక వెలవెలబోతోంది. ఇందుకు ఉత్తరకాలువ ఆధునికీకరణ పనుల్లో నెలకొన్న నిర్లిప్తతే కారణం. నాన్‌డెల్టా పరిధిలోని ఈకాలువ కింద సుమారు 40 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అనంతసాగరం, మర్రిపాడు, ఆత్మకూరు, కొండాపురం, జలదంకి, కావలి, లింగసముద్రం మండలాల మీదుగా రాళ్లపాడు వరకు ఈ కాలువ 106 కిలోమీటర్లు విస్తరించి ఉంది. అయితే దశల వారీగా కాలువ సామర్థ్యాన్ని పెంచుతున్నారు. కాలువ ఆయకట్టు స్థిరీకరణ లేకపోవడంతో 340 క్యూసెక్కులు కలిగిన నీటి ప్రవాహాన్ని 750 క్యూసెక్కులకు పెంచారు. మూడేళ్ల క్రితం డబ్లింగ్ పనులు ఆమోదించి కాలువ సామర్థ్యాన్ని రెట్టింపు చేశారు. అయితే పూర్తిస్థాయిలో పనులు జరగలేదు. ఈకారణంగా సోమశిలలో పుష్కలంగా నీరు ఉన్నా, చివరి ఆయకట్టుకు నీరు సమృద్ధిగా ఇవ్వలేని దుస్థితి. కాగా రాళ్లపాడు జలాశయం సామర్థ్యం 1.1 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.1 అడుగులకు మాత్రమే నీటిమట్టం పరిమితమైంది. జలాశయంలో నీటిమట్టం తగ్గి రంగు మారుతున్నట్లు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పూర్తిగా పనులు జరిగి ఉంటే నేడు కృష్ణాజలాలతో రాళ్లపాడు కూడా జలకళను సంతరించుకుని ఉండేది. కాగా, సోమశిలకు సోమవారం 21,947 క్యూసెక్కుల వరద వస్తుండగా 69.390 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 5000, డెల్టాకు 1,850 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోకి పదోన్నతి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) బుచ్చిరెడ్డిపాళెం ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న నారాయణరెడ్డికి ఎంపీడీఓగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సచివాలయాల సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. నారాయణ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా నారాయణరెడ్డి తిరుపతి జిల్లాలో ఎంపీడీఓగా బదిలీ కానున్నట్టు తెలిసింది.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 10330
వెండి కిలో ధర	రూ. 128000
వెండి ఒక గ్రాము	రూ. 131.00

పశు వైద్యుడికి సన్మానం



పశువైద్యుడిని సన్మానిస్తున్న ఉద్యోగులు

రాపూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబర్తి వైద్యశాలలో పశు వైద్యుడిగా పనిచేస్తున్న బొడ్డు ప్రసాద్ పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలంలో అసిస్టెంట్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందగా ఉద్యోగులు సోమవారం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పెంచల్‌రెడ్డి, అఖిల్, జాన్, రవి, రమణయ్య, లక్ష్మీభవానీ, సుప్రజ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్ అందజేస్తున్న మురళీకృష్ణ

పొదలకూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి 1986-1988 ఇంటర్మీడియట్ బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు కంప్యూటర్, టేబుల్‌ను ప్రిన్సిపాల్‌కు అందజేశారు. దేశ విదేశాల్లో ఉన్న మిత్రులందరూ కలిసి తమ సహచర మిత్రుడు ఇదే కళాశాలలో పనిచేస్తున్న మురళీ కృష్ణ ద్వారా కంప్యూటర్, టేబుల్‌ని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు జీవితంలో స్థిరపడ్డాక తాము చదువుకున్న విద్యా సంస్థల అభివృద్ధిలో తోడ్పాటు అందించాలన్నారు. 1986-1988 బ్యాచ్ విద్యార్థులకు కళాశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

సీనియర్లకు ఘన సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మనుబోలు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఉపాధ్యాయులను జూనియర్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మండలంలోని వీరంపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం జూనియర్ ఉపాధ్యాయులు సీనియర్ ఉపాధ్యాయులైన ప్రధానోపాధ్యాయులు లక్ష్మీకాంతారావు, సోషల్ అసిస్టెంట్ ప్రభావతిని శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సహచర ఉపాధ్యాయులు సోమా పద్మారత్నం, జీబీ దాస్, శ్రీధర్, శైలజ, సరస్వతి, మృదుల పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముత్తుకూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మూలి వెంగయ్య డిమాండ్ చేశారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మత్స్యకారేతర ప్యాకేజీ బ్యాలెన్స్ కుటుంబానికి నెలకు రూ. 2500, కట్ట బియ్యం మంజూరు చేయాలన్నారు. గతంలో కృష్ణపట్నం పోర్టు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పామాయిల్ ఫ్యాక్టరీల యాజమాన్యాలతో చర్చలు జరిపినా ప్రయోజనం లేదన్నారు. ఎంపీడీవో నాగమణిని కలిసి పిడతాపోలూరు చెరువుకట్టపై పెరిగిపోయిన చెట్లను తొలగించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య, నాయకులు నక్కా రాధయ్య, దుంపల ఏడుకొండలు, మోహన్‌రావు, జయరామయ్య, మన్నె పద్మమ్మ, ఉమా, వెంకటేశ్వర్లు, అంకయ్య. తదితరులు పాల్గొన్నారు.

అధిక యూరియాతో పంటకు నష్టం

బిట్రగుంట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అధికంగా యూరియా వాడటం వల్ల కలిగే నష్టాలను రైతులు తప్పనిసరిగా తెలుసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి శైలజ సూచించారు. సోమవారం బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల, కోవూరుపల్లి గ్రామాల్లో అధిక యూరియా వాడకంపై రైతులకు అవగాహన సదస్సులు ఆమె నిర్వహించారు. యూరియా అధికంగా వాడటం వల్ల చౌడు భూమిగా మారే ప్రమాదం ఉందన్నారు. పైరుకు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాటకరాణి శీనయ్య, ఎన్ రంగయ్య, ఎం గోపపీకృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

'బుచ్చి'లో దుర్గంధం.. వ్యాధుల భయం!

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని ప్రధాన, మురుగు కాలువలు, వీధుల్లో నివాసాల వెంబడి వుండే మురుగు కాలువలన్నీ ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలతో దర్గంధభరితం కావడంతో పారిశుధ్యం పడకేసింది. ఖాజానగర్, శాంతినగర్, హౌస్‌తోట, రామకృష్ణానగర్, బేల్దారిపాళెం, పెద్దూరు దళితవాడ, మంగలికట్ట, మార్కెట్ పరిసర ప్రాంతాలు, కామాక్షికాలనీ, రాఘవరెడ్డికాలనీ, ఇస్కపాళెం, సుబ్బారెడ్డినగర్, మలిదేవి కాలువ వెంబడి వున్న పలు ప్రాంతాల్లో పట్టపగలే పెద్దలు సైతం దోమల ఉధృతికి తట్టుకోలేక పిల్లలు,వృద్ధులు ఎక్కడ వ్యాధులు బారిన పడతారోనని ప్రజలు ఆందోళనలోనౌతున్నారు. మలిదేవి కాలువ, పాత, కొత్త గుడపల్లికాలువలు, రేబాల కాలువ, పీర్లకాలువ, వర్రికాలువ దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. దీనికితోడు మురుగు కాలువల్లో పందులు స్వైర విహారం చేస్తూండడంతో మరింత దర్గంధం వెదజల్లుతోంది. పారిశుధ్యం సమస్యపై ఇప్పటికే 5 వవార్డు దగ్గర్నుంచి దోమల నివారణకు స్ప్రేయింగ్, ఆయిల్ బాల్స్ వదులుతున్నట్టు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. పందుల సంచారంపై పెంపకందారులకు నోటీసులు కూడా జారీ చేశామన్నారు. పందుల సంచారాన్ని అదుపు చేయకపోతే నగర పంచాయతీ నుంచి చట్టపర చర్యలు తీసుకుని పూర్తిగా పందుల సంచారాన్ని నివారిస్తామని తెలిపారు. ముంబాయి జాతీయ రహదారి వెంబడి ప్రధాన మురుగు కాలువల్లో త్వరలో పూడికతీత చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. అవసరమైన అన్ని మురుగు కాలువల్లో పూడికతీత చేపడతామని తెలిపారు.



వ్యర్థాలతో నిండిపోయిన గుడపల్లి మురుగు నీటి కాలువ

కాలువల్లో పూడిక తీయడం లేదు



మురుగు కాలువలు వ్యర్థాలతో నిండిపోయాయి. పూడిక తీయడం లేదు. దోమల బెడద చాలా ఉంది. నానా బాధలు పడుతున్నాం. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. కాలువల్లో పూడిక తీయాలి. ఆరోగ్యాన్ని కాపాడాలి.

\- జడపల్లి పద్మ, ఆకుల వారివీధి, రామకృష్ణానగర్, బుచ్చి.

కమిషనర్ పట్టించుకోరు..



పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉంది. కమిషనర్‌కు ఎన్నోసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. మురుగు కాలువలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమల బెడద తీవ్రంగా ఉంది. వర్షాకాలం లోపు కాలువల్లో పూడిక తీయకుంటే ప్రజలు సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రమాదం వుంది.

\- కాసా శ్రీనివాసులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

రీ సర్వేతో భూమి నష్టపోయామమ్మా !

● తహసీల్దారుతో మహిళ మొర



మహిళ సమస్య వింటున్న తహసీల్దార్

మనుబోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో జరిగిన రీసర్వే వల్ల తమకున్న భూమిలో 1-18 సెంట్లు కోల్పోయామంటూ లక్ష్మీనరసింహపురం గ్రామానికి చెందిన ఓ ముస్లిం కుటుంబం తహసీల్దారుతో మొర పెట్టుకుంది. సోమవారం గ్రీవెన్స్‌లో ఎస్కే ఖాశింసాహెబ్ దివ్యాంగుడు కావడంతో భార్య సాయంతో భూ సమస్య చెప్పుకునేందుకు తహసీల్దారు రమాదేవి వద్దకు వచ్చారు. పిడూరు రెవెన్యూ పరిధిలో తనకు సర్వేనెం. 483లో రెండు ఎకరాల భూమి ఉందని, అయితే రీసర్వే జరిగిన తరువాత తనకున్నది కేవలం 82 సెంట్లు మాత్రమేనని చెప్పడంతో నష్టపోయామంటూ విన్నవించుకున్నారు. అక్కడే ఉన్న ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి తహసీల్దారుతో మాట్లాడుతూ రైతులు, పేదలు తీసుకువచ్చే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. విచారణ చేసి, సరైన పత్రాలు ఉంటే రీ సర్వేలో జరిగిన తప్పిదాలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని వినతి

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలంటూ ఐటీడీఏ ఏపీఐవో మస్తాన్ తహసీల్దారును కోరారు. సోమవారం ఆయన తహసీల్దార్ రమాదేవితో మాట్లాడుతూ ఈనెల 21 నుంచి వారం రోజుల పాటు కేవలం గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయనున్నామన్నారు. మండలంలో ఇప్పటివరకు 288 మందికి రైస్ కార్డులు లేవన్నారు. అలాగే 172మంది ఉన్న కార్డులలో నమోదు కావాల్సి ఉందన్నారు. ఆరేళ్ల పైబడిన గిరిజనులందరికీ డోమ్‌సెల్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. తద్వారా వారికి ఇతర పత్రాలు లేకున్నా ఆధార్‌కార్డు వచ్చేలా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారన్నారు.

ఏపీ నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్‌గా షేక్ అల్తాఫ్



షేక్ అల్తాఫ్

తోటపల్లిగూడూరు (వెంకటాచలం), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ముస్లిం నూర్‌బాషా (దూదేకుల) కార్పొరేషన్ డైరెక్టర్‌గా సర్వేపల్లి నియోజక వర్గంలోని తోటపల్లిగూడూరు మండలం మాచర్లవారిపాళెం గ్రామానికి చెందిన షేక్ అల్తాఫ్ సోమవారం నియమితులయ్యారు. ఆయన గతంలో టీడీపీ నూర్‌బాషా సాధికారత సమితి సర్వేపల్లి నియోజకవర్గ కన్వీనర్‌గా పని చేశారు. దీంతోపాటు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నూర్‌బాషా సంఘంలో అనేక పదవులను చేపట్టారు. ప్రస్తుతం ఈయన టీడీపీ నూర్‌బాషా సాధికారత సమితి జిల్లా అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు. గత సార్వత్రిక ఎన్నికల్లో సోమిరెడ్డికి మద్దతుగా సర్వేపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లిం వర్గం ఓట్లు టీడీపీకి పడేలా ముమ్మరంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ముస్లింలపై జరిగిన దాడులు, దౌర్జన్యాలను ప్రశ్నించడమే కాకుండా ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి, టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలకు షేక్ అల్తాఫ్ ధన్యవాదాలు తెలియజేశారు. పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

వీఎస్‌యూలో అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ ప్రాంగణంలో సోమవారం జాతీయ విద్యా విధానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత విచ్చేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఇది పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం కాకుండా, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, సృజనాత్మకత, ప్రయోగికజ్ఞానంపై దృష్టి సారిస్తుందన్నారు. ఉపాధ్యాయులు ఈ మార్పులను స్వీకరించి విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సన్నద్ధం చేయాలన్నారు. వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ విజయ మాట్లాడుతూ పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తమ భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ నోడల్ ఆఫీసర్లు డాక్టర్ ఆర్ మధుమతి, డాక్టర్ జీ విజయలక్ష్మి, ప్రొఫెసర్ సుజాఎస్ నాయర్, డాక్టర్ శ్యాం భగవాన్, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, డాక్టర్ జోష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఓడించినా వైసీపీకి బుద్ధి రాలేదా?

జనసేన పార్టీ సమన్వయకర్త సురేష్ నాయుడు



మాట్లాడుతున్న బొబ్బేపల్లి సురేష్ నాయుడు

వెంకటాచలం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా వైసీపీకి బుద్ధి రాలేదా? అని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ప్రశ్నించారు. వెంకటాచలం జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ వైసీపీ నేతలు అడగడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డికి ప్రతిపక్ష హోదా కావాలి గానీ.. వైసీపీ హయంలో జరిగిన అవినీతి, అక్రమాలను మాత్రం వెలికి తీయకూడదా? అని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలపై దాడులు చేయడమే కాకుండా మద్యం నుంచి ఇసుక, గ్రావెల్ వంటి సహజ సంపదను విచ్చలవిడిగా దోచుకున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా దక్కకుండా ప్రజలు తీర్పు ఇవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో జనసేన నేతలు పినిశెట్టి మల్లికార్జున్, పొట్లూరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఏడుగురికి గాయాలు



చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

ముత్తుకూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీ కొనడంతో ఏడుగురు గాయపడ్డ సంఘటన కృష్ణపట్నం పోర్ట్ జీరో పాయింట్ వద్ద సోమవారం చోటుచేసు కుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటాచలం మండలం నుంచి పనుల నిమిత్తం కృష్ణపట్నం పోర్టుకు కార్మికులు ఆటోలో వెళుతుండగా, పోర్టు నుంచి వస్తున్న టిప్పర్ జీవో పాయింట్ వద్ద ఆటోను ఢీకొంది. దీంతో కార్మికుల్లో ఏడుగురు గాయపడ్డారు. తలకు తీవ్ర గాయం కావడంతో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోర్టు అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేశారు.

లైసెన్స్ ఉన్న ఆటో కార్మికులకు వాహనమిత్ర ఇవ్వాలి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ వున్న ప్రతీ ఆటో కార్మికుడికి వాహనమిత్ర పథకంలో భాగంగా రూ. 25 వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం బుచ్చిలోని తహసీల్దారు కార్యాలయం ముందు ఆటోకార్మికులతో ఆయన ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వం వాహనాల ఎఫ్‌సి ప్రక్రియను ప్రైవేటుకి అప్పగించిందని, ఇప్పుడు ప్రభుత్వం కూడా ప్రైవేటుకే అప్పజెప్పిందన్నారు. దీనివల్ల ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఆటో కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రాధయ్య, నాయకులు మాల్యాద్రి, సునీల్, రాహుల్, నాగరాజు, శ్రీనాథ్, మాధవ్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలూ.. యూరియా వాడకం తగ్గించండి



కోవూరు : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

కోవూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట పొలాల్లో యూరియా వాడకాన్ని తగ్గించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత కోరారు. ఇనమడుగు గ్రామంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఎకరాకు మూడు బస్తాల యూరియా మాత్రమే వాడాలన్నారు. యూరియా ఎక్కువగా వాడితే పంట ఏపుగా పెరిగి ఆకు ముదురుపచ్చ రంగులోకి మారుతుందన్నారు. దీంతో రైతులు ఎక్కువగా క్రిమిసంహారక మందులను వాడాల్సి వస్తోందన్నారు. యూరియా అతిగా వాడటం వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. వ్యవసాయాధికారిణి రజిని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచు ప్రమీల, ఎంపీటీసీ సభ్యురాలు కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట గ్రామ సచివాలయంలో రైతులకు మండల వ్యవసాయాధికారి రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో యూరియా వాడకంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యూరియాను అధికంగా వాడినప్పుడు నష్టాలు వస్తాయని ఆయన తెలిపారు. ఒక ఎకర వరి పొలానికి మూడు బస్తాల యూరియా సరిపోతుందని, అది కూడా 4,5 విడతల్లో వాడుకోవాలన్నారు. అధిక మోతాదులో యూరియా వాడితే మొక్కలు ఏపుగా ఎదిగి చిన్న గాలికే నేలకు ఒరుగుతాయని, తెగుళ్ల అధికంగా వ్యాపించి పంటకు అపారమైన నష్టాన్ని కలుగజేస్తాయన్నారు. సిఫార్సు మేరకు నత్రజని ఎరువులను వాడుకోవాలన్నారు. విపరీతంగా ఎరువులు వాడటం వల్ల భూసారం కూడా తగ్గి, నేలలు కలుషితమవుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ దయానా, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మనుబోలు: వచ్చే రబీ సీజన్‌లోనైనా వరిసాగులో మోతాదుకు మించి యూరియా వాడద్దంటూ సోమవారం పిడూరులో వ్యవసాయాధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ అతిగా యూరియా వాడితే రైతు అన్ని విధాలుగా నష్టపోతారన్నారు. రబీ సాగులో యూరియా వాడకాలు తగ్గిం చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పిడూరు ఇన్‌చార్జి సర్పంచు తిక్కవరపు వెంకటేశ్వర్లు రెడ్డి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

కత్తితో బెదిరించిన రౌడీషీటర్ అరెస్ట్



రౌడీషీటర్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ అయ్యప్ప

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): లాడ్జీ ఓనర్‌ను కత్తితో బెదిరించి నగదు దోచుకెళ్లిన రౌడీషీటర్‌ను చిన్నబజారు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుడి వివరాలను ఎస్ఐ అయ్యప్ప వెల్లడించారు. నగరంలోని ఉమ్మారెడ్డిగుంట ప్రాంతంలో పెనుబల్లి భాస్కర్‌రెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయన చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో 33 ఏళ్లుగా శ్రీ రఘురామ్ లాడ్జిని నిర్వహిస్తున్నారు. అక్కడికి అప్పుడప్పుడు రౌడీషీటర్ ముంగమూరు సాయితేజరెడ్డి అలియాస్ బుల్లెట్ సాయి వచ్చి రూము తీసుకొని ఖాళీ చేసి వెళ్లేప్పుడు డబ్బులు కట్టకుండా గొడవపెట్టుకొని పోతుంటేవాడు. ఈ క్రమంలోనే ఈనెల 6వ తేదీ రాత్రి లాడ్జికి వచ్చిన బుల్లెట్ సాయి 7వ తేదీ ఉదయం రిసెప్షన్‌లో ఉన్న యజమాని భాస్కర్‌రెడ్డితో గొడవపడ్డాడు. రూ.2వేలు ఇవ్వాలని కోరాడు. నేను ఎందుకు డబ్బులు ఇవ్వాలని ప్రశ్నించగా రౌడీషీటర్ కత్తితో బెదిరించడంతో ప్రాణభయంతో అతను రూ.2 వేలు ఇచ్చాడు. ఈ క్రమంలో బాధితుడు ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సోమవారం రౌడీషీటర్ బుల్లెట్ సాయిను అరెస్ట్ చేశారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కావలి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి (55) మృతి చెందిన ఘటన సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఉదయగిరి బ్రిడ్జి వద్ద జరిగింది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. తిరుపతి - పూరి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు లోకో పైలెట్ అందించిన సమాచారం మేరకు జీఆర్పీ ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. చెన్నై సెంట్రల్ నుండి ఒంగోలుకు తీసుకున్న రైలు టికెట్ ఉండటంతో ఒంగోలు ప్రాంతానికి చెందిన వ్యక్తి అయి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు తెలుపు రంగు చొక్కా, పిస్తా గ్రీన్ కలర్ లుంగీ ధరించి ఉన్నాడు. మృతుని నడుముకు నేవీ బ్లూరంగు బెల్టు, ఛాతీపై గతంలో ఆపరేషన్ చేసిన గుర్తులతో పాటు వీపుపై పెద్ద కణితి ఉంది. మృతుడు అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్రావ్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరికి గాయాలు



బోల్తాపడ్డ ట్రాక్టర్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలు తీసుకెళుతున్న ఓ ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమ వారం మండలంలోని భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలో చోటుచేసుకొంది. వివరాల మేరకు.. తిమ్మారెడ్డిపల్లి నుంచి విద్యుత్ స్తంభాల లోడుతో 565 జాతీయ రహదారిపై వరికుంటపాడుకు వెళుతున్న ఆ ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపుతప్పడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో జార్ఖండ్‌కు చెందిన రమేష్, బీర్‌సింగ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రకాశం జిల్లా పామూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలోకి కారు దూసుకెళ్లి ముగ్గురికి...



పొలంలో గేటు దిమ్మెను ఢీకొన్న కారు

జలదంకి, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం చినక్రాక వద్ద కావలి కాలువ సమీపంలో ఎన్‌హెచ్ 167బీజీ రహదారిపై సోమవారం సాయంత్రం రోడ్డుప్రమాదం జరిగింది. కావలి నుండి కలిగిరి వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి పొలంలోని గేటు దిమ్మెను ఢీకొంది. వెంటనే కారులో బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ముగ్గురు ప్రయాణీకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కావలి పట్టణంలో విద్యార్థిని కాలేజీలో చేర్పించి, తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన జరిగిన వెంటనే ఆ మార్గంలో వెళుతున్న వాహనదారులు గాయపడ్డ వెంకటేశ్వర్లు కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులను కారులోంచీ బయటికి తీసి, 108 వాహనంలో కలిగిరికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించుకుని గ్రామానికి తిరిగి వెళ్ళారు. ఈ సంఘటనపై జలదంకి పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

మోటార్ స్టార్టర్ దగ్ధం

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని కట్టకిందపల్లి హరిజనవాడలో రక్షిత మంచినీటి పథకం మోటార్‌కు సంబంధించిన స్టార్టర్ సోమవారం తెల్లవారుజామున దగ్ధమైంది. స్టార్టర్ షార్ట్‌సర్క్యూట్ జరిగి దగ్ధమైందా లేదా ఎవరైనా కావాలని దగ్ధం చేశారా అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేసి పంచాయతీ కార్యదర్శి షేక్ నజీముల్లా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించి అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంచినీటి సమస్య తలెత్తకుండా కొత్త స్టార్టర్‌ను ఏర్పాటు చేశారు. కాగా, కాలనీలో జరుగుతున్న వరుస సంఘటనలపై ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని వారు కోరుతున్నారు.

కుమార్తె అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

మనుబోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తె (16) కనిపించడం లేదంటూ సోమవారం రాత్రి మందాటి గురవయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గురవయ్యకు ఇద్దరు పిల్లలు. కుమార్తె నెల్లూరులోని ఓ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతోంది. నెల రోజులుగా కళాశాలకు వెళ్ళకుండా ఇంట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో ఉదయం 10 గంటల సమయంలో పక్కవీధిలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్ళి వస్తానని ఇంట్లోంచి వచ్చేసింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు వెతకడం ప్రారంభించారు. బంధువుల ఇళ్లతోపాటు, చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో గురవయ్య దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 545



యాచకులకు నిలయంగా మారిన, అసంపూర్తిగా ఉన్న యాత్రికుల వసతి భవనం



దర్గా ప్రాంగణంలో శుభ్రం చేసేవారు లేక పేరుకుపోయిన చెత్తచెదారం

దర్గాకు దిక్కెవరు..!

- ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తకుప్పలు
- యాత్రికులకు వసతుల కరువు, చెట్లే దిక్కు
- అసంపూర్తిగా వసతి భవన నిర్మాణం
- శిథిలావస్థలో చిల్డ్రన్స్ పార్కు
- ముఖద్వారం వద్ద యథేచ్ఛగా ఆక్రమణలు
- స్వర్ణాల చెరువు ఘాట్‌లో అల్లుకున్న గుర్రపు డెక్క



స్వర్ణాల చెరువు ఘాట్‌లో అల్లుకున్న గుర్రపు డెక్క

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ గుర్తింపు పొంది, మతసామరస్యానికి ప్రతీకగా ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచిన బారాషహీద్ దర్గా ప్రాంగణం సమస్యలకు నిలయంగా మారింది. ఈ దర్గాలో ఏడాదికి ఒకసారి మొహర్రం మాసంలో కోర్కెలు తీర్చే రొట్టెల పండుగ 5 రోజులుపాటు వైభవంగా జరుగుతోంది. పండుగ అనంతరం దర్గాను పవిత్రంగా, ఆధ్యాత్మిక, ఆహ్లాద కేంద్రంగా చూడాల్సిన వారు ఎవరూ లేకపోవడంతో బారాషహీద్ దర్గాకు దిక్కెవరూ అనే ప్రశ్న తలెత్తుతోంది. రొట్టెల పండుగ సందర్భంగా బారాషహీద్ దర్గాలో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోంది. అలాగే అన్నీ శాఖలు రొట్టెల పండుగకు తరలివచ్చే యాత్రికులకు వసతులు కోసం సమన్వయంతో పని చేస్తారు. ఈ సంవత్సరం రొట్టెల పండుగ కోసం ప్రభుత్వం దాదాపు రూ.10కోట్లు ఖర్చు చేసింది. రొట్టెల పండుగ అనంతరం ప్రతీరోజు ఇతర ప్రాంతాల నుంచి యాత్రికులు 500 నుంచి 700 మంది వరకు దర్గాను దర్శించుకొంటారు. అలాగే నగర వాసులు ఉదయం, సాయంత్రం విహరించేందుకు వస్తుంటారు. అయితే దర్గా మొత్తం చెత్తకుప్పలతో నిండిపోయింది. దర్గా పరిసరాలలోనూ చెత్తకుప్పలే. దూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు సేద తీరేందుకు వసతి గదులు నిర్మించారు. నిధులు లేకపోవడంతో కాంట్రాక్టరు శ్లాబ్ వేసి వదిలివేశారు. ఆ భవనంలో యాచకులు చేరిపోయారు. దీంతో దూర ప్రాంతం నుంచి వచ్చిన యాత్రికులు చెట్లు కింద సేద తీర్చుకుంటున్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ప్రతీ ఏడాది దర్గా నిర్వహణకు, అద్దెలు, హుండీలు ఆదాయం పొందేందుకు టెండరు పిలుస్తోంది. టెండరుదారుడు రొట్టెల పండుగలోని దర్గా మైదానం అంతా దుకాణదారులకు భూమిని లీజుకి ఇచ్చి ఐదు రోజులు రూ.వేలల్లో దండుకుంటారు. రొట్టెల పండుగ 5రోజులు హుండీ ఆదాయం తీసుకుంటారు. బారాషహీద్ దర్గాలో ఉన్న సుమారు 24 దుకాణాలకు నెల అద్దెలు దండుకుంటారు. ఏడాది పొడవునా యాత్రికుల వాహనాలకు, టూరిస్టు బస్సుల కు ఫీజులు వసూలు చేసు కుంటారు. ఆదాయం తప్ప దర్గాను పరిశుభ్రంగా ఉంచడం, స్వర్ణాల ఘాట్ పరిశుభ్రత, తదితర నిర్వహణను బారా షహీద్ దర్గా ఏడాదికి లీజుకు పాడుకున్న కాంట్రాక్టరు గాలికి వదిలేస్తున్నాడు. ప్రస్తుతం దర్గా అంతా చెత్త కుప్పలు, ప్లాస్టిక్ కవర్లు నిండిపోయి పర్యావరణంకు ఇబ్బందికరంగా తయా రైంది. అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు, దర్గా పరిసరాలు ఎలా ఉన్నాయో కూడా చూడడంలేదు. దీంతో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తకుప్పలు, వసతులు కరువై చెట్ల కింద సేదతీరు తున్న యాత్రికులు, వసతి భవనంలో చేరిన యాచకులు, శిథిలావస్థకు చేరిన చిల్డ్రన్స్ పార్కు, ముఖద్వారం వద్ద యథేచ్ఛగా వెలుస్తున్న ఆక్రమణలు, స్వర్ణాల చెరువు ఘాట్‌లో అల్లుకుంటున్న గుర్రపు డెక్క దర్శనమిస్తోన్నాయి. దీంతో దర్గా పవిత్రత దెబ్బతినే పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు దర్గాపై దృష్టి సారించాలని యాత్రికులు, స్థానికులు కోరుతున్నారు.



బారాషహీద్ దర్గా ముఖద్వారం వద్ద అక్రమంగా వెలసిన దుకాణం

● దర్గా పరిసరాల శుభ్రత బాధ్యత కాంట్రాకర్‌దే...

దర్గా దుస్థితిపై వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖుదావల్‌ను వివరణ కోరగా దర్గా పరిసర ప్రాంతాల లీజుకు 11 నెలలకు పాడుకున్న కంట్రాక్టర్ దర్గాను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఉందన్నారు. టెండరు పాట అగ్రిమెంటులో దానిని స్పష్టంగా వక్ఫ్‌బోర్డు నమోదు చేసిందని ఆయన పేర్కొన్నారు.



వసతి లేక చెట్ల కిందే యాత్రికులు

న్యూస్ బాక్స్

గ్రంథాలయాలకు అభివృద్ధి కమిటీలు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాల అభివృద్ధి దృష్ట్యా జిల్లాలోని అన్ని గ్రంథాలయాలకు అభివృద్ధి కమిటీలు, రీడర్స్ క్లబ్‌లు ఏర్పాటు చేసి గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేయనున్నట్లు పౌర గ్రంథాలయ సంచాలకులు ఏ.కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కార్యదర్శులతో జరిగిన జూమ్ మీటింట్‌లో ఆయన మాట్లాడుతూ పాఠకులకు అవసరమైన పత్రికలు, పుస్తకాల ఎంపికలో, గ్రంథాలయాలకు అవసరమైన సదుపాయాలు ఏర్పారుచుకొనుటలో గ్రంథాలయాల అభివృద్ధి కమిటీలకు ప్రాధాన్యత ఉందన్నారు. దాతల సహకారంతో గ్రంథాలయాల అభివృద్ధికి బాటలు వేసుకొనవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

నెల్లూరు(విద్య), సెప్టంబరు 8(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ తమ సభ్యులు అహ్మద్‌హుస్సేన్ సేవా దృక్పథంతో రోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఒకరోజు అన్నదానం చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవిచంద్ర, నేతలు స్వర్ణ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేదసంస్కృత పాఠశాలలో అక్షరాస్యత దినోత్సవం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : నగరంలోని వేద సంస్కృత పాఠశాలలో సోమవారం ప్రజాసత్తా ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శోభన్‌బాబు మాట్లాడుతూ అక్షరాస్యత ప్రాముఖ్యతను మానవహక్కుగా, సాధికారతను గుర్తు చేయడమే లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థులకు అక్షరాస్యత దినోత్సవ ప్రాముఖ్యతను, విద్యకు ఉన్న ప్రాధాన్యతను తెలియచేస్తూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్ఆర్.శర్మ, ప్రజాసత్తా నేతలు దయాకర్, షబానా తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల సంప్రోక్షణ

● గ్రహశాంతి కోసం బారులు తీరిన భక్తులు



తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆలయ శుద్ధి చేస్తున్న అర్చకులు, సిబ్బంది

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రాహుగ్రస్త చంద్రగ్రహణం సోమవారం అర్ధరాత్రి ముగిసింది. గ్రహణం పూర్తి కావడంతో భక్తులకు ఆలయ దర్శనం కల్పించేందుకు అన్ని ఆలయాల్లో సంప్రోక్షణ పూజలు జరిగాయి. పవిత్ర గంగా జలాలతో ఆలయాలను, మూలవిరాట్‌లను శుద్ధి చేసి నిత్య పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయాలు పునఃదర్శనం కోసం సూర్యోదయంకు ముందే భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. శివాలయాలు, సుబ్రహ్మణ్యస్వామి, వినాయక మందిరాలు, అమ్మవారి ఆలయాల్లో గ్రహ శాంతి పూజలు, దానాల కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. నగరంలో తల్పగిరి రంగనాథ స్వామి ఆలయం రాజరాజేశ్వరి ఆలయం, మూలస్థానేశ్వరాలయం, పప్పులవీధి సిద్ధివిఘ్నేశ్వర స్వామి ఆల యాలతోపాటు అన్నీ ఆలయాల్లో గ్రహ శాంతి పూజలు దానాల కార్యక్రమాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మూలస్థానేశ్వరస్వామి ఆలయం లో కోవూరు మాజీ శాసన సభ్యుడు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దంపతులు, కిమ్స్ హాస్పిటల్ జీఎం తాళ్లూరు గిరినాయుడు, తదితర ప్రముఖులు గ్రహ శాంతి పూజలు జరిపించుకుని గ్రహణ శాంతి దానాలు చేశారు.

ఆర్వో ప్లాంట్లపై దృష్టి సారించండి

● ఎన్ఎంసీ కమిషనర్ నందన్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్ కర్తం

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులు శు భ్రత, మినరల్ లేని వాటర్‌ను విక్రయిస్తూ సొ మ్ము చేసుకుంటున్నారని, అలాంటి ప్లాంట్లపై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన కమిషనర్ నందన్‌కు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. ఆర్వో ప్లాంట్ల నుంచి సురక్షిత తాగునీరు అందడం లేదన్నారు. నాణ్యత లేని నీటిని అందచేస్తున్నారన్నారు. ప్రతీ డివిజన్‌లోనూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఎన్టీఆర్ సుజల ప్లాంట్లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, కత్తి శ్రీనివాసులు 53, 54 డివిజన్లలో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ బ్యాంకు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ ప్రాంతాలలో పేదలు ఎక్కువగా జీవిస్తున్నందున ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన బ్యాంకును అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కాగా పలు డివిజన్లలో కమిషనర్ పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్డు ఆక్రమణల తొలగించాలని సిటీప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఇలాంటి పరిస్థితితులు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

మా ఇష్టం.. అడిగేదెవరు..?

- ● పప్పులవీధిలో వాహనదారుల ఇష్టారాజ్యం
- ● నిత్యం రోడ్లపైనే నిలుపుదల
- ● నిబంధనలకు విరుద్ధంగా లారీల ప్రవేశం
- ● ట్రాఫిక్‌తో అష్టకష్టాలు పడుతున్న ప్రజలు
- ● మామూళ్ల మత్తులో పట్టించుకోని పోలీసులు



పప్పుల వీధిలో సరుకులు దించుతున్న లారీతో ఆగిన వాహనాల రాకపోకలు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది మంది వ్యాపారులు, కొనుగోలు దారులతో నిత్యం రద్దీగా ఉండే స్టోన్‌హౌస్ పేట పప్పులవీధిలో వాహనచోదకులు, ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. నగరంలోని ప్రధాన వ్యాపారకూడలైన పప్పులవీధి హోల్‌సేల్ ధరల్లో సరుకులు లభించే ప్రాంతంగా పేరుఉంది. జిల్లా వ్యాప్తంగా వందలాది వాహనాల్లో చిరు వ్యాపారస్తులు, సామన్య ప్రజలు ఈ ప్రాంతానికి వస్తుంటారు. దీంతో సహజంగానే ట్రాఫిక్ కష్టాలు ఉంటాయి. దీనికి తోడు నిబంధనలకు విరుద్ధంగా భారీ లారీలు సరుకులు తీసుకొని వచ్చేస్తున్నాయి. ఉన్న కాస్తా రోడ్డులో భారీ లారీలు నిలిపివేయడంతో పూర్తిగా వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో గంటలతరబడి పప్పులవీధిలో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సివస్తోంది.

● నిబంధనలు గాలికి

అనేక ఏళ్లుగా పప్పులవీధిలో ట్రాఫిక్ కష్టాల సమస్య ఉండటంతో గతంలో ఉన్న జిల్లా పోలీసు ఉన్నతాధికారులు కొన్ని నిబంధనలు పెట్టారు. ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు భారీ వాహనాలను అనుమతి నిరాకరించారు. సరుకులు దిగుమతి చేసుకోవాలంటే రాత్రి 10 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు వాహనాలకు అనుమతి ఇచ్చారు. ఈ నిబంధనలు పాటిస్తే ఎలాంటి ట్రాఫిక్ ఇక్కట్లు ఉండవు. అయితే వాహనదారులు ఈ నిబంధనలు గాలికి వదిలేశారు. మా రోడ్డు... మా ఇష్టం.. అడిగేదెవరంటూ ఏ సమయంలోనైనా భారీ లారీలను తీసుకొచ్చి పప్పులవీధిలో అడ్డంగా పెట్టి గంటల తరబడి సరుకులు దిగుమతి చేస్తున్నారు. దీంతో నిత్యం ఈ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభిస్తుంది.

● మామూళ్ల మత్తులో ఖాకీలు

భారీ వాహనాలు పప్పులవీధిలోకి నిబంధనలు అతిక్రమించి రాకుండా ఉండేలా సంబంధిత పోలీసుశాఖ పర్యవేక్షించాల్సి ఉంది. అయితే మామూళ్ల మత్తులో ఉండటంతో పట్టించుకోడం సరికదా.... అటువైపు కన్నెత్తు కూడా చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పప్పులవీధి వ్యాపారస్తులు, వాహనాల యజమానులు భారీగా మాముళ్ల అందిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రయాణికులు, సామాన్య ప్రజలు కష్టాలతో వీరకి పనిలేకుండా పోయిందని బహిరండంగా చర్చించుకొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిబంధనల ప్రకారం రద్దీ సమయాల్లో భారీ వాహనాలకు అనుమతి ఇవ్వకుండా చూడాల్సి ఉంది.

ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

● ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటికి సన్మానం



అల్లంపాటి పెంచలరెడ్డిని సన్మానిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మరోసారి నుడా సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న అల్లంపాటి పెంచలరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో నగరంలోని నుడా కార్యాలయంలో సోమవారం ఆయనను నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించి మాట్లాడారు. రెవెన్యూ శాఖ ప్రభుత్వంలో అత్యంత కీలకమని, రెవెన్యూ ఉద్యోగులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొని వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలన్నారు. మెజార్టీ ఉద్యోగులు ఉన్న రెవెన్యూ అసోసియేషన్‌కు జిల్లా అధ్యక్షుడుగా రెండవసారి ఎన్నిక కావడం గొప్ప విషయమన్నారు. అదేవిధంగా నుడా అధికారులు, సిబ్బంది, తదితరులు పెంచలరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉలవపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరేపల్లి జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహన చోదకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరేపల్లి ఎస్టీ యానాది కాలనీకి చెందిన యాకసిరి చెంచయ్య(39) కారు నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. సోమవారం రాత్రి తన కారుని ఇంటి దగ్గర పెట్టి హైవే మీద ఉన్న దాబాకు వెళ్లి తిరిగి కాలనీలోకి వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో చెంచయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. మృతుడు చెంచయ్యకు భార్య వరమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేత్రదానంతో అంధులకు చూపు

● ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న వైద్య నిపుణులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : నేత్రదానం చేస్తే అంధులకు చూపు ప్రసాదించవచ్చని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి పేర్కొన్నారు. సోమవారం వైద్య కళాశాల ప్రాంగణంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్రదానంపై అవగాహన లేక అనేక మంది తమ నేత్రాలను వృథా చేస్తున్నారన్నారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్న సూక్తి అందరికీ తెలిసినా అలాంటి కంటి చూపు లేకుండా చాలా మంది ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అలాంటి వారికి మరణానంతరం నేత్రదానం చేస్తే వారికి కంటి చూపు ప్రసాదించవచ్చని తెలిపారు. ఇవన్నీ తెలిసినా కొందరు నేత్రదానం చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఇలాంటి వారికి నేత్రదానం ఆవశ్యకతను తెలియచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, నేత్రవిభాగం హెచ్‌వోడీ డాక్టర్ వసంత, మెడికోలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో చక్కటి ఆరోగ్యం

దగదర్తి (బిట్రగుంట) సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో చక్కటి ఆరోగ్యం సిద్ధిస్తుందని మోడల్ టీం లీడర్ హరిచందన తెలిపారు. సోమవారం దగదర్తి మండల పీహెచ్, తహసీల్దారు కార్యాలయాల వద్ద ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరకాయలు, ఆకుకూరలను విక్రయించే స్టాళ్లను ఏర్పాటు చేశారు. ప్రతిఒక్కరూ ఇంటి పెరట్లో కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవాలని హరిచందన తెలిపారు. పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వాటిని కొనుగోలు చేసేందుకు పలువురు ఆసక్తి చూపారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

వరికుంటపాడు(ఉదయగిరిరూరల్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వరికుంటపాడు, భాస్కరాపురం గ్రామాల్లో మైనింగ్ తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ సోమవారం గ్రామస్థులు జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, జిల్లా మైనింగ్ ఏడీలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని 233-1 సర్వేనెంబర్‌లో మంజూరు చేసిన తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ గత ఆరు నెలల నుంచి కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నప్పటికీ తమ గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోయారు. దీంతో వినతిపత్రాలు అందుకున్న ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి నివేదికలు అందజేయాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. త్వరలో తాము కూడా ఆప్రాంతాన్ని పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిలీప్‌కుమార్, మేధావుల ఫోరం సభ్యుడు సరాబు లక్ష్మీనారాయణ, వినియోగదారుల ఫోరం, మానవహక్కుల రాష్ట్ర కన్వీనర్ చల్లగాలి వెంకటమోహన్, షేక్ పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి : డీఎల్‌డీవో

ఉదయగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వామిత్వ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆత్మకూరు డీఎల్‌డీవో టీ రమణయ్య సూచించారు. సోమవారం స్థానిక రైతుసేవా కేంద్రం-1లో పంచాయతీ కార్యదర్శులు, సర్వే సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ, అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ఇంటి స్థలాలు, ఖాళీ స్థలాలకు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వ మే స్వయంగా సర్వే నిర్వహించి ఇంటి కొలతలు సేక రించి వారి హక్కు పత్రంలా ఆస్తి వివరాలు పొందు పర్చి కార్డు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్డు ద్వారా భవిష్యత్తులో ఎన్నో ఎన్నో ఉపయోగాలు ఉంటాయని పేర్కొన్నారు. కనుక రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంతో పాటు బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు సైతం పొందవచ్చన్నారు. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బడే బారు !!

● చీకటి పడితే .. 'మందు' బాబులదే రాజ్యం!

● తెల్లారితే ఆవరణలో దర్శనమిస్తున్న మద్యం సీసాలు





బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చదువుల తోటలో 'అక్షర' కుసుమాలు గుబాళించాల్సి న చోట.. 'మద్యం' కంపు కొడుతోంది. 'పుస్తకాలు' సీతాకోకచిలుకలై విహరించాల్సిన 'జ్ఞాన' స్థలిలో పగి లిన మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. చీకటి పడితే చాలు.. ఈ సరస్వతీ నిలయం మందు బాబుల అడ్డాగా మారిపోతోంది. మండలంలోని రేబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొంతకాలంగా నెల కొన్న దుస్థితి ఇది! క్రీడా పరికరాలో.. రన్నింగ్ ట్రాకులో ఉండాల్సిన తమ పాఠశాల ఆవరణలో అడుగడుగునా మందు సీసాలు పడి ఉండడం చూసి అమాయక బాల్యం.. అక్కడ జరుగుతున్నదేమిటో తెలియక అయోమయానికి గురవుతోంది. ఉదయాన్నే మైదానంలోకి వాకింగ్ వెళ్ళేవారికి సాక్షాత్తు సరస్వతీదేవి విగ్రహం పక్కనే ఖాళీ మద్యం సీసాలు స్వాగతం చెబుతున్నాయి. అంతేకాదు.. ఖాళీ నీళ్ల ప్యాకెట్లు, తిని పడేసిన చికెన్ వ్యర్థాలతో పాఠశాల మైదానంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. రాత్రివేళల్లో మందు బాబులు పాఠశాల మైదానంలోకి రాకుండా ప్రధానోపాధ్యాయుడు గానీ, విద్యా కమిటీ సభ్యులు గానీ అడ్డుకునే సాహసం ఎందుకు చేయలేకపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. తమ పాఠశాలలో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకుని బయటి వ్యక్తులు ఎవరూ రాత్రివేళ పాఠశాలలోకి ప్రవేశించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టేలా విద్యాశాఖాధికారులు, పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. నైట్ వాచ్‌మన్‌ను బెదిరించి మరీ మద్యం సేవిస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించి రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

వ్యర్థాలతో కళారూపాలు

ఆకట్టుకున్న డాక్టర్ లక్ష్మీసుహాసిని ప్రదర్శన





కళాకారిణి లక్ష్మీసుహాసినిని సత్కరిస్తున్న అన్నపూర్ణ



నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సృజన ఉంటే ఏ వస్తువులైనా కళాఖండం చేయవచ్చని డాక్టర్ లక్ష్మీసుహాసిని నిరూపించారు. సోమవారం ఆమె ఓ పాఠశాలలో గుండీలు, పిన్నులు, చెంచాలు, గింజలు, కొయ్య ముక్కలు, అట్టముక్కలు, ప్లాస్టిక్ కాగితాలు, ఇలా ఏవి పనికి రావు అనుకుంటామో వాటితో కళా ఖండాలు తయారు చేసి ప్రదర్శించారు. ఆమె రూపొందించిన ప్రతి కళారూపం అందరినీ ఆకటుకుంది. ఈ ఎగ్జిబిషన్‌ను డాక్టర్ అమీర్‌జాన్ ప్రారంభించారు. రచయిత్రిలు చంద్రలత, గోవిందరాజు సుభద్రాదేవి, పాతూరి అన్నపూర్ణ, వినయ, ఆర్టిస్టు సుందర్, విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా కళాకారిణిని డాక్టర్ లక్ష్మీసుహాసినీని సన్మానించారు.

నేత్రదానంపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత

● ముగిసిన నేత్రదాన పక్షోత్సవాలు



మోటివేటర్లతో డీఎంహెచ్‌వో

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నేత్రదానం ఆవశ్యకత ను గుర్తించి గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత తెలిపారు. సోమవారం నేత్రదాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం డీఎం హెచ్‌వో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సుజాతతో పాటు జిల్లా అంధత్వ నివారణ సంస్థ మేనేజర్ డాక్టర్ శార్వాణి మాట్లాడారు. అవయవ దానాల్లో నేత్రాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, అన్ని అవయవాలు బాగున్నా నేత్రాలు లేనిదే ప్రకృతిని చూడ లేమన్నారు. అలాంటి పరిస్థితిలో నేత్రదాతలు ఇచ్చే నేత్రాల వల్లే ఎందరికో చూపు వస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో నేత్రదానం కోసం ఎదురు చూస్తు న్న ఎందరికో మృతి చెందిన వారి నేత్రాలు దానం చేస్తే చూపు వస్తుందని చెప్పారు. దీనికి కుటుంబ సభ్యులు చూపుతున్న ఆదరణ మరెం దరికో ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్నియా (నల్లగుడ్డు) వ్యాధితో ఎంతో మంది కనుచూపు కోల్పోతూ అంధులవుతున్నారన్నారు. గతంలో 40 ఏళ్లపై బడిన వారు కార్నియా వ్యాధితో అంధులు అవుతుండగా, ప్రస్తుతం చిన్న పిల్లలను సైతం ఈ సమస్య వెంటాడు తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి నేత్రదాతల నేత్రాలే అమర్చాలని, అయితే అవసరానికి తగ్గట్టు నేత్రదాతలు ముందుకు రావడం లేదని, కేవలం 20 శాతం మాత్రమే అంగీకారం తెలుపుతున్నారన్నారు. దీంతో సమస్య తీవ్రతరం అవుతోందని, మూఢ నమ్మకాలు సైతం నేత్రదానంకు అనేక అవరోధాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం నేత్రదాన మోటివేటర్లు వైవీ సుబ్బారావు, పీఎంపీ అసోసియేషన్ నేత వేణుగోపాల్, చిరం జీవి ఐ బ్యాంకు సుధీర్, వాసవి క్లబ్ భయ్యాప్రసాద్, దేవళ్ల శ్రీనివాసులు, మన సేవాసన్నిధి, శ్రీవాణి, హేమలత, అభయ ఆర్గనైజేషన్, వాసవి వనిత, తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

నానో... ఎంతో మేలు !

● ఆ ఎరువులపై రైతులకు అవగాహన అవసరం

● పెట్టుబడితోపాటు శ్రమ కూడా తక్కువే

● ఎక్కడికైనా ఇట్టే తీసుకెళ్లవచ్చు



డ్రోన్ ద్వారా నానో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు(ఫైల్)

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు అన్నదాతలు ఎంతో శ్రమిస్తారు. అందుకు అవసరమైన ఎరువుల కోసం నానా అగచాట్లు పడతారు. ఇదే అవకాశంగా భావించి కొందరు వ్యాపారులు అధిక ధరలకు అమ్మడంతోపాటు నకిలీ ఎరువులను రైతులకు అంటగడుతున్నారు. అంతేకాక కొనుగోలు చేసిన ఎరువులను పొలాలకు తీసుకెళ్లడం మరో సమస్య. ఇందుకు రవాణా ఖర్చు అదనం. ఇవన్నీ కూడా రైతులకు ఇబ్బందులు కలిగించే అంశాలే. వీటి నుంచి వారికి ఉపశమనం కలిగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'నానో' ఎరువులను అందుబాటులోకి తీసుకువచ్చాయి. తక్కువ ధరకు అందుబాటులో ఉండడంతోపాటు తీసుకెళ్లడం కూడా ఎంతో సులభంగా ఉంటుంది. ఆర్థిక భారం, శారీరక శ్రమ తగ్గుతాయి.

● ప్రయోజనాలెన్నో..

మార్కెట్‌లో 45కేజీల యూరియా బస్తా ధర రూ.266. డిమాండ్ ఉన్న సమయంలో సుమారుగా రూ.350ల వరకు పలుకుతోంది. ఇక ఇంటికి తీసుకెళ్లేందుకు రవాణా ఖర్చులు అదనం. రైతు లు ఎకరాకు ఒక బస్తాను వాడేస్తున్నారు. అయితే 500మి.లీ నానో యూరియా బాటిల్ రూ.225లకే అందుబాటులో ఉంది. దీన్ని మోయాల్సిన అవసరం లేదు. రవాణా ఖర్చు ఉండదు. చేతిలో పట్టుకుని ఎక్కడికయినా తీసుకువెళ్లవచ్చు. ఇంకా ఇది పంటకు స్ప్రే చేస్తే మొక్కకు పూర్తిస్థాయిలో అందుతుంది. అంతేకాక ఎకరాకు ఒక బాటిల్ సరిపోతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇకపోతే డీఏపీ బస్తా దాదాపుగా రూ.1350 నుంచి రూ.1400 వరకు ఉంటుంది. అదే డీఏపీ నానో బాటిల్ రూ.600లకే అందుబాటులో ఉంది.

● అవగాహన అవసరం

జిల్లాలో రబీ, ఖరీఫ్ సీజన్లలో సుమారుగా 8లక్షల ఎకరాల్లో వివిధ పైర్లను రైతులు సాగు చేస్తారు. ఇందులో 6లక్షల ఎకరాలకు పైగా వరి సాగవుతుందని అంచనా. వరి సాగు చేస్తున్న రైతులకు యూరియా, డీఏపీ ఎంతో అవసరం. అధికారులు సిఫార్సు చేసిన మోతాదు కంటే ఎక్కువగా వినియోగిస్తుంటారు. దీంతో ఏటేటా పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ఈఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 4137 మెట్రిక్ టన్నుల యూరియా, 2812 మెట్రిక్ టన్నుల డీఏపీ వినియోగించినట్లు వ్యవసాయశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఎరువుల వినియోగం సమయానికి నీరు అందుబాటులో లేకపోయినా, నీరు ఎక్కువైనా పంటలకు చల్లిన ఎరువులు వృథా కావాల్సిందే. అయితే నానో ఎరువుల వాడకం వల్ల ఈ సమస్య ఉండదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే వీటిపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేదు. నానో ఎరువులను వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేసేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం

నానో యూరియా, డీఏపీ ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంతోపాటు వివిధ కార్యక్రమాల్లో నానో ఎరువుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేస్తున్నాం. నానో ఎరువులపై జిల్లాలోని వ్యవసాయాధికారులకు శిక్షణ కూడా ఇచ్చాం.

- పీ.సత్యవాణి, డీఏవో

కలెక్టర్‌ను కలిసిన ఏపీఆర్‌ఎస్‌ఏ నాయకులు



కలెక్టర్ ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీఆర్‌ఎస్‌ఏ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఎన్నికైన ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏ పీఆర్‌ఎస్‌ఏ) కార్యవర్గ నాయకులు సోమవారం కలెక్టర్ ఆనంద్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. నూతన కార్యవర్గ సభ్యులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూశాఖ గౌరవం పెరిగేలా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, కార్యదర్శి నాగేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడు బొబ్బా మురళి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం ఎప్పుడో?

● పీజీఆర్‌ఎస్‌కు రికార్డు స్థాయిలో 515 అర్జీలు ● రెవెన్యూశాఖకు చెందినవే 221 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సంబంధ సమస్యలు నానాటికీ పెరిగిపోతున్నాయి. మండలస్థాయిలో వాటికి పరిష్కారం కలగకపోవడంతో కలెక్టరేట్‌కు అర్జీదారులు పోటెత్తుతున్నారు. ప్రతి సోమవారం ఒకటి కాదు, రెండు కాదు వందల సంఖ్యలో రెవెన్యూ సంబంధ అర్జీలు వస్తున్నాయంటే పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో అర్థమవుతోంది. మండల స్థాయిలోనే రెవెన్యూ సమస్యలను పరిష్కరించా లని, ఒక వేళ సమస్యలను పరిష్కరించలేకపోతే ఎందుకు పరిష్కరించలేక పోతున్నారో కారణాన్ని అర్జీదారులకు తెలియ చేయాలని కలెక్టర్ సూచి స్తున్నా అది ఆచరణకు నోచుకోవడం లేదని స్పష్టమవు తోంది. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రికార్డు స్థాయిలో మొత్తం 515 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 221 అర్జీలు ఉన్నాయి. సర్వేశాఖకు 31 అర్జీ లు వచ్చాయి. మిగిలినవి వివిధ శాఖలకు సంబంధించిన వి ఉన్నాయి. ఈ అర్జీలను స్వీకరించిన కలెక్టర్ ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు నిర్థిష్ట గడువులోగా పరిష్కరించా లని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం పీజీఆర్‌ఎస్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్జీల పట్ల మానవ త్వంతో కూడిన సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నా రు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో విజయకుమా ర్, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● భూమికి హద్దులు చూపించాలి

జిల్లాలోని కలువాయి మండలం చింతలాత్మకూరుకు చెందిన ఎస్.నిరంజన్ తన భూమికి హద్దులు చూపించాలని కోరుతూ కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలాత్మ కూరు సర్వే నెంబరు 32-సి1లో 30 సెంట్ల భూమి తనకు ఉందని చెప్పారు. మా గ్రామా నికి చెందిన శివశంకర్ భార్య వైదేహి ఈ భూమిని ఆక్రమించు కుని నాపైన దౌర్జన్యం చేస్తోంద ని ఆరోపించారు. నా భూమికి హద్దులు చూపించాలని కోరారు.

సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలి

నెల్లూరు(వైద్యం) : మనుబోలు మండలం కాగితాల పూరులో ఇనాం మిగుల భూమిలో సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద బాధితులతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతి పత్రం అందజేశారు. 25 ఏళ్లుగా ఇనాం భూములను 180 మంది ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు వరి సాగు చేస్తున్నాయన్నారు. అయితే అధికార పార్టీకి చెందిన కొందరు ఆ భూమి వారసులమంటూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నేతలు తలారి దేవదానం, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ జీ.కృష్ణకాంత్ అధికారులను ఆదేశించారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా వాసుల నుంచి 109 ఫిర్యాదులు వచ్చారు. వీటిని స్వీకరించిన ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజరు శ్రీనివాసులురెడ్డి, మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ రామారావు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ భూముల్లో జామాయిల్ కర్ర నరికివేత

అడ్డుకున్న గ్రామస్థులు

ఉదయగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం గ్రామంలో అసైన్‌మెంట్ భూముల్లో జామాయిల్ కర్ర నరికివేతను సోమవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. వివరాల మేరకు.. తిరుమలాపురం గ్రామంలో కొందరు పేదలకు గతంలో ప్రభుత్వం అసైన్‌మెంట్ భూములను మంజూరు చేసింది. వాటిని కొందరు రైతులు జామాయిల్ సాగు చేసుకునేందుకు పదేళ్ల లీజు కింద ఓ వ్యక్తికి అప్పగించారు. కాగా, లీజుకు తీసుకున్న వ్యక్తి పొలాల్లో జామాయిల్ సాగు చేపట్టాడు. అయితే రీసర్వేలో భాగంగా పొలాల హద్దులు మారిపోయాయి. కొందరు రైతులకు ఏపుగా జామాయిల్ పెరిగిన భూములు దక్కగా, మరి కొందరికి జామాయిల్ చెట్లు సరిగాలేని పొలా లు దక్కాయి. దీంతో జామాయిల్ ఎక్కువగా పెరిగి ఉన్న రైతులు లీజు తీసుకున్న వ్యక్తి జా మాయిల్ చెట్లను నరికిస్తుండగా అడ్డుకున్నారు. తమ పొలాల్లో తమ అనుమతి లేకుండా చెట్లు ఎలా నరుకుతారని అడ్డుకున్నారు. అనం తరం వీఆర్వో రాజేష్‌కు గ్రామస్థులు సమాచా రం అందించడంతో ఆయన అక్కడికి చేరుకుని రైతులందరూ హద్దులు ఏర్పాటు చేసుకునే వరకు జామాయిల్ నరకవద్దని అక్కడనుంచి కూలీలను పంపించివేశారు.

టీకాల అమల్లో పురోగతి

● లక్ష్యసాధనలో సత్ఫలితాలు

● 90 శాతం టార్గెట్లు పూర్తి

● పల్స్‌పోలియో తరహాలో నిర్వహణ

● గ్రామాల్లో ప్రచారం, అవగాహన అవసరం



చిన్నారికి టీకా వేస్తున్న నర్సు

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బిడ్డ పుట్టగానే వివిధ రకాల వ్యాధులు ప్రబలకుండా వెంటనే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా అవయవలోపాలతోపాటు ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంది. వీటిని తప్పనిసరిగా అమలు చేయాలంటూ ప్రభుత్వం కూడా నిబంధనలు విధించింది. గతంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా చిన్నారులకు వ్యాధులు ప్రబలుతూనే ఉన్నాయి. అయితే ప్రస్తుతం వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలు పూర్తి చేయటంపై అధికారులు శ్రద్ధ పెట్టారు. ఫలితంగా 95 శాతం లక్ష్యాలు పూర్తయ్యాయి. జిల్లాలో ఏటా 3.26 లక్షల మంది చిన్నారులకు నిర్దేశించిన కాలానికి అనుగుణంగా టీకాలు వేయాల్సి ఉంది. ఆ దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అయితే గ్రామాల్లో ప్రచారం చేయడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది.

● కొరవడిన పర్యవేక్షణ

బిడ్డ పుట్టినప్పటి నుంచి 60 నెలల వరకు పోలియో చుక్కలతోపాటు క్షయ, మసూచి, ధనుర్వాతం, కోరింతదగ్గు, కంఠసర్పిలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలి. ఆయా జిల్లా ఆసుపత్రులతోపాటు సీహెచ్‌సీలు, పీహెచ్‌ల పరిధిలో వీటిని అమలు చేయాలి. ప్రతి బుధ శనివారాల్లో వైద్యసిబ్బంది గ్రామాల్లో తిరిగి గుర్తించిన పిల్లలకు టీకాలు వేయాలి. ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు టీకాల పంపిణీ చేపట్టాల్సి ఉంది. అయితే వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా టీకాల అమలుపై అనేక సందేహాలు రేకెత్తుతున్నాయి. గ్రామీణ స్థాయిలో చిన్నారులను పూర్తిగా పరిశీలించి వారికి అవసరమైన అన్ని టీకాలను వేయాల్సి ఉంది.

● అవగాహన కల్పించాలి

ఏటా పోలియో వ్యాధికి మాత్రం రూ.లక్షలు ఖర్చు చేసి విస్తృత ప్రచారం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. అయితే మిగిలిన వ్యాధులపై ప్రచారం, అవగాహనలో మాత్రం చేతులెత్తేస్తున్నారు. కనీసం ఈ టీకా వేసుకుంటే ఈ వ్యాధులు రావని, తప్పనిసరిగా వేయించుకోండని ప్రచారం చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగినా టీకాలు సక్రమంగా ఎప్పుడెప్పుడు వేసుకోవాలో చెప్పరు. మెదడువాపు వ్యాధి రాకుండా ఎంతో విలువైన వ్యాక్సిన్‌ను చైనా నుంచి దిగుమతి చేసుకున్నారు. ప్రస్తుతం మెదడువాపు వ్యాధి వచ్చే కాలం అయినా దీనిపై ప్రజలకు అవగాహన కల్పించరు.

టీకాల అమలుకు కృషి



జిల్లాలోని ప్రతీ చిన్నారికి ఎనిమిది రకాల వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు కృషి చేస్తున్నాం. ఈ ఏడాది జీరో డోస్ ఓపీవీ వ్యాక్సిన్‌లోపాటు అన్నీ రకాల టీకాలను 95 శాతం వేశాం. ఎక్కడెక్కడ చిన్నారులు ఉన్నారో గుర్తించి టీకాలు వేస్తు న్నాం. ప్రతి పీహెచ్‌సీని తనిఖీ చేసి టీకాలు వేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి

హిజ్రాలకు నైపుణ్యాభివృద్ధిపై ఉచిత శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు కార్డు కలిగి ఉండి, ఇంటర్మీడియట్, డిగ్రీ వరకు చదువుకుని 18 నుంచి 28 ఏళ్ల వయస్సు కలిగిన హిజ్రాలకు పోటీ పరీక్షలు, నైపుణ్యాభివృద్ధిపై ఉచితంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని విభిన్నప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకుడు ఏ.మహమ్మద్ ఆయూబ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21 సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా జాతీయ స్థాయిలో ఐటీ, ఐటీఈఎస్ రంగాలలో ఉపాధి అవకాశాలను పొందేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. వివరాలకు 7993723291ను, నగరంలోని వనంతోపులో ఉన్న తమ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలపై 12న చలో కలెక్టరేట్

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.సునీల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌లను సోమవారం నగరంలోని వీఆర్‌సీ సెంటర్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు తిష్ఠవేయడంతోపాటు విద్యార్థుల హక్కులకు భంగం కలిగించే జీవోలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా నేటికీ విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, కళాశాలల్లో సమస్యలు, సంక్షేమ వసతి గృహాల్లో ఇబ్బందులు, గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయలు, ఖాళీగా ఉన్న విద్యారంగం పోస్టుల భర్తీ, తదితర సమస్యలపై పోరాటాలకు సిద్ధమయ్యామన్నారు. ఈ సమస్యలన్నింటిని ప్రశ్నిస్తూ చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి విద్యార్థు లు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కే.షారూఖ్‌ఖాన్, నేతలు కే.ఆశీర్వాదం, చరణ్, సాయి, తాహిర్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

కండలేరు డ్యాం ఇన్‌ఫ్లో 6వేల క్యూసెక్కులు

రాపూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండలేరు డ్యాం నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 42.050 టీఎంసీలు ఉందని ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 6వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా 1125 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెళ్తుందని అధికారులు పేర్కొన్నారు

విలువలతో కూడిన విద్యనందించాలి

ఉదయగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యనందించాలని ఎంఈవో-2 టీ శ్రీనివాసులు సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. క్రమశిక్షణతో చదవి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10330
వెండి కిలో ధర	రూ. 128000
వెండి ఒక గ్రాము	రూ. 131.00

న్యూస్ బాక్స్

ఘనంగా గణనాథుడి గ్రామోత్సవం


గణనాథుడి గ్రామోత్సవం

సంగం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా స్థానిక శివాలయం సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని 13వ రోజు సోమవారం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పెన్నానదిలో నిమజ్జనం చేశారు.

దసరా ఉత్సవాలకు శ్రీకారం


ఆలయ ఆవరణలో పసుపు దంచుతున్న మహిళలు

ఉదయగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న సంతానలక్ష్మి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహిళలు పసుపు దంచి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మహిళలు, ఉత్సవాల నిర్వాహకులు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో పసుపు దంచే కార్యక్రమం చేపట్టారు. పసుపు దంచేందుకు మహిళలు పోటీపడ్డారు. ఉత్సవాలు అక్టోబరు 2వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోండి


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతసాగరం సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాగరంలో జ్వరాలు ఎక్కువగా ప్రబలుతున్నాయని, నివారణ చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులుకు వినతిపత్రం అందచేసి పారిశుధ్య చర్యలు చేపట్టి జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, మస్తాన్, జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవోలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 14 మందిని సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంఈవోలు కొండయ్య, రమణయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు టెన్నికాయిట్ జిల్లా క్రీడాకారుల ఎంపిక

సంగం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీబీకెఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సీనియర్ మహిళలు, పురుషుల విభాగంలో టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవి రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు స్కూల్ స్టడీ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకుని మధ్యాహ్నం 3 గంటలకు హాజరుకావాలని ఆయన తెలిపారు. ఎంపికైన వారు ఈనెల 13, 14 తేదీల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో జరిగే ఉమ్మడి జిల్లాల అంతర్ రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఆధార్ కేంద్రాలు లేక ప్రజల ఇక్కట్లు

● సిబ్బంది బదిలీతో పనిచేయని కేంద్రాలు ● పట్టించుకోని అధికారులు


ఆధార్ తీసే పరికరాలు ఉన్న సచివాలయం

సంగం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో కొత్తకార్డు కావాలన్నా.. చేర్పులు, మార్పులు చేయించుకోవాలన్నా మండల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయాల్లో ఆధార్ తీసే పరికరాలు ఉన్నా తీసేవారు లేక మూలన పడేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలోని మీసేవా కేంద్రంలో, కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన పోస్టాఫీసుల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇవి ప్రజలకు అందుబాటులో ఉండేవి. దీంతో కొత్త కార్డు కావాలన్నా.. కార్డులో చేర్పులు, మార్పులు చేసుకోవాలన్నా నేరుగా కేంద్రాలకు వెళ్లి చేయించుకునేవారు.

వైసీపీ హయాంలో మూతబడ్డ మీ సేవా కేంద్రాలు

2019 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. అందులో భాగంగా సంగం మండలంలో వంగల్లు, సిద్దీపురం, సంగం-శివ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. దీంతో అప్పటివరకు ఎంతోమంది నిరు ద్యోగులకు జీవనోపాధిగా ఉన్న మీసేవా కేంద్రాలతోపాటు ఆధార్‌కేంద్రాలు మూతపడ్డాయి. పోస్టాఫీసుల్లో సైతం ఆధార్ కేంద్రాలకు ఆపరేటర్లను నియమించకపోవడంతో మూతపడింది.

ఉద్యోగుల బదిలీతో నిలిచిపోయిన ఆధార్ సేవలు

ప్రభుత్వం ఇటీవల సచివాలయ ఉద్యోగుల బదిలీలు చేపట్టింది. దీంతో ఆధార్ కేంద్రాల్లో ఉన్న సచివాలయ ఉద్యోగులు కూడా బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తగా వచ్చిన ఉద్యోగులు (డిజిటల్ అసిస్టెంట్)లకు ఆధార్ తీసే అనుమతి లేదు. ఆధార్ తీయాలంటే యూఐడీఏఐ సంస్థ వీరికి శిక్షణ ఇచ్చి యూనిక్ కోడ్ నెంబరు ఇవ్వాలి. దీంతో సచివాలయాలకు వచ్చిన డిజిటల్ అసిస్టెంట్‌లకు యూఐడీ కోడ్ లేకపోవడంతో ఆధార్ కేంద్రాలు పని చేయడం లేదు. దీంతో 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న బుచ్చిరెడ్డిపాళెం గానీ ఆత్మకూరు గానీ వెళ్లాల్సి వస్తోంది. ఒకవేళ వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లినా ఆరోజు అక్కడ పని అవుతుందో, లేదో చెప్పలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంగం, వంగల్లు, సిద్దీపురం సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్‌లకు యూఐడి సంస్థ ద్వారా శిక్షణ ఇప్పించి యూనిక్ కోడ్ నెంబర్లు ఇచ్చి ఆధార్ కేంద్రాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధిక యూరియా వాడకం అనర్థదాయకం


సంగం : తలుపూరుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ ఉద్యోగులు



అనంతసాగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఉద్యోగులు

సంగం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అధిక యూరియా వాడకం అనర్థదాయకం అని, సేంద్రీయ ఎరువుల వినియోగం శ్రేయస్కరం అని వ్యవసాయాధికారి శశిధర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన వ్యవసాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని తలుపూరుపాడు, సంగం గ్రామాల్లో అధిక యూరియా వినియోగం వల్ల కలిగే నష్టాలపై ర్యాలీ నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక యూరియా వాడకం నేల సారాన్ని దెబ్బతీస్తుందని, అంతేకాకుండా చీడపీడలు ఆశించే అవకాశం ఎక్కువని, అధిక యూరియా వాడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** పంటలకు అధిక మోతాదులో యూరియా వాడవద్దని ఏవో శైలజాకుమారి రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని లింగంగుంట, బెడుసుపల్లి గ్రామాల్లో యూరియా ఎక్కువగా వాడితే కలిగే అనర్థాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

●**చేజర్ల:** రైతులు పంటలకు యూరియా అధికంగా వాడకూడదని మండల వ్యవసాయశాఖ అధికారి బి.జ్యోష్ణ తెలిపారు. సోమవారం చేజర్లలో అధిక యూరియా వాడడం వలన కలుగు పరిణామాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులు వాడి యూరియా వినియోగం తగ్గించుకోవాలన్నారు. అదేవిధంగా రైతులు పీఎమ్‌డీఎస్ కిట్లు వినియోగించటం వలన అధిక పోషకాలు ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

●**దుత్తలూరు (ఉదయగిరి):** పంటలకు అధిక మోతాదులో యూరియా వాడడం అనర్థదాయకమని మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్ సూచించారు. సోమవారం మండలంలోని వెంకటంపేట గ్రామ రైతుసేవా కేంద్రంలో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సాగులో ఉన్న పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీపీఏలు మీర్‌అహ్మద్, రోషిణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●**సీతారామపురం:** మండలంలోని పబ్బులేటిపల్లి, చిన్ననాగంపల్లి గ్రామాలలో రైతులకు సోమవారం మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి పంటలకు యూరియా వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సూచనల మేరకు మాత్రమే యూరియా వాడాలని, అధికాంగా వాడకూడదని సూచించారు. ఈకార్యక్రమంలో జెబిఎన్‌ఫ్ రామమోహన్,వీపీఏ వెంకటేశ్వర్లు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలి : సీపీఐ


ఆర్డీవోకు వినతిపత్రం అందచేస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని సీపీఐ నాయకులు సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రస్తుతం కెఎన్‌ఎం 1638, 733, ఎంటీయు 1010 రకం ధాన్యం ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయన్నారు. దళారులు కుమ్మక్కై ఎంటీయు 1010 రకం ధాన్యం రూ. 15,000కు కెఎన్‌ఎం 1638, 733 రకం ధాన్యం రూ 16,000కు కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధరకంటే తక్కువకు కొంటున్న మిల్లర్లు, దళారులపై చర్యలు తీసుకోవాలని, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో పావనికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మైనింగ్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలి


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరికుంటపాడు, భాస్కరాపురం గ్రామాల్లో మైనింగ్ తవ్వ కాల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ సోమవారం గ్రామస్థులు జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, జిల్లా మైనింగ్ ఏడీలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని 233-1 సర్వేనెంబర్‌లో మంజూరు చేసిన తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ గత ఆరు నెలల నుంచి కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నప్పటికీ తమ గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోయారు. దీంతో వినతిపత్రాలు అందుకున్న ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి నివేదికలు అందజేయాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. త్వరలో తాము కూడా ఆప్రాంతాన్ని పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిలీప్‌కుమార్, మేధావుల ఫోరం సభ్యుడు సరాబు లక్ష్మీనారాయణ, వినియోగదారుల ఫోరం, మానవహక్కుల రాష్ట్ర కన్వీనర్ చల్లగాలి వెంకటమోహన్, షేక్ పీరయ్య పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థుల ఆందోళన


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న చింతలపాలెం గ్రామస్థులు

వింజమూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏకిస్త్రీపురం పంచాయతీలోని చింతలపాలెం బీసీ కాలనీలో నీటిసమస్య పరిష్కరించాలని సోమవారం కాలనీవాసులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతలపాలెం గ్రామంలో కనీసం రోడ్డు, నీరు, విద్యుత్ సౌకర్యం ఏమీలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు కుటుంబాలు ఇక్కడ బతకలేక వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం ఎంపీడీవోటకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఒకటి, రెండు రోజుల్లో బోరు వేయించి నీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దాంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో చింతలపాలెం బీసీ కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి : డీఎల్‌డీవో


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో రమణయ్య

ఉదయగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వామిత్వ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆత్మకూరు డీఎల్‌డీవో టీ రమణయ్య సూచించారు. సోమవారం స్థానిక రైతుసేవా కేంద్రం-1లో పంచాయతీ కార్యదర్శులు, సర్వే సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ఇంటి స్థలాలు, ఖాళీ స్థలాలకు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వమే స్వయంగా సర్వే నిర్వహించి ఇంటి కొలతలు సేకరించి వారి హక్కు పత్రంలా ఆస్తి వివరాలు పొందుపర్చి కార్డు మంజూరుచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్డు ద్వారా భవిష్యత్తులో ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంతోపాటు బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు సైతం పొందవచ్చన్నారు. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాధ్యులు, సభ్యులు

ఉదయగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్య సమాజాభివృద్ధితోపాటు వ్యక్తుల భవిష్యత్తును మార్చుతుందని జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు షేక్ నస్రుల్లా పేర్కొన్నారు. సోమవారం విద్యారంగ సవాళ్లను అధ్యయనం చేసి పరిష్కారం చూపేందుకు ఆంధ్ర ఎడ్యుకేషన్ మూమెంట్ అనే ఉద్యమంలో భాగంగా స్థానిక దిలావర్‌భాయ్‌వీధిలోని మదరసాను సందర్శించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐవో, ఐవోఎం బాధ్యులు అజరుల్లా, తారిఖ్‌అజీస్, సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలి


డీఎల్‌డీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు

ఉదయగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచి తమను ఆదుకోవాలని రాష్ట్ర గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ పారిశుధ్య కార్మికులు స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆత్మకూరు డీఎల్‌డీవో టీ రమణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉదయగిరి మేజర్ పంచాయతీలో పారిశుధ్య, పీడబ్ల్యూఎస్ కార్మికులు, ఎలక్ట్రిషియన్‌లు విధులు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీ నిధుల లభ్యతను బట్టి కార్మికులకు వేతనాలు పెంచి ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి సర్క్యులర్ జారీ చేశారన్నారు. ఉదయగిరి గ్రామ పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధుల కింద ప్రతి ఏడాది 1.40 కోట్ల వరకు వస్తాయని, అందుకు అనుగుణంగా తమకు వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



కత్తితో బెదిరించిన రౌడీషీటర్ అరెస్ట్


రౌడీషీటర్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ అయ్యప్ప

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): లాడ్జ్ ఓనర్‌ను కత్తితో బెదిరించి నగదు దోచుకెళ్లిన రౌడీషీటర్‌ను చిన్నబజారు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుడి వివరాలను ఎస్ఐ అయ్యప్ప వెల్లడించారు. నగరంలోని ఉమ్మారెడ్డిగుంట ప్రాంతంలో పెనుబల్లి భాస్కర్‌రెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయన చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో 33 ఏళ్లుగా శ్రీ రఘురామ్ లాడ్జిని నిర్వహిస్తున్నారు. అక్కడికి అప్పుడప్పుడు రౌడీషీటర్ ముంగమూరు సాయితేజరెడ్డి అలియాస్ బుల్లెట్ సాయి వచ్చి రూము తీసుకొని ఖాళీ చేసి వెళ్లేప్పుడు డబ్బులు కట్టకుండా గొడవపెట్టుకొని పోతుంటేవాడు. ఈ క్రమంలోనే ఈనెల 6వ తేదీ రాత్రి లాడ్జికి వచ్చిన బుల్లెట్ సాయి 7వ తేదీ ఉదయం రిసెప్షన్‌లో ఉన్న యజమాని భాస్కర్‌రెడ్డితో గొడవపడ్డాడు. రూ.2వేలు ఇవ్వాలని కోరాడు. నేను ఎందుకు డబ్బులు ఇవ్వాలని ప్రశ్నించగా రౌడీషీటర్ కత్తితో బెదిరించడంతో ప్రాణభయంతో అతను రూ.2 వేలు ఇచ్చాడు. ఈ క్రమంలో బాధితుడు ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సోమవారం రౌడీషీటర్ బుల్లెట్ సాయిను అరెస్ట్ చేశారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కావలి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి (55) మృతి చెందిన ఘటన సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఉదయగిరి బ్రిడ్జి వద్ద జరిగింది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. తిరుపతి - పూరి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు లోకో పైలెట్ అందించిన సమాచారం మేరకు జీఆర్పీ ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. చెన్నై సెంట్రల్ నుండి ఒంగోలుకు తీసుకున్న రైలు టికెట్ ఉండటంతో ఒంగోలు ప్రాంతానికి చెందిన వ్యక్తి అయి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు తెలుపు రంగు చొక్కా, పిస్తా గ్రీన్ కలర్ లుంగీ ధరించి ఉన్నాడు. మృతుని నడుముకు నేవీ బ్లూరంగు బెల్టు, ఛాతీపై గతంలో ఆపరేషన్ చేసిన గుర్తులతో పాటు వీపుపై పెద్ద కణిత ఉంది. మృతుడు అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్రావ్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరికి గాయాలు


బోల్తాపడ్డ ట్రాక్టర్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలు తీసుకెళుతున్న ఓ ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమ వారం మండలంలోని భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలో చోటుచేసుకొంది. వివరాల మేరకు.. తిమ్మారెడ్డిపల్లి నుంచి విద్యుత్ స్తంభాల లోడుతో 565 జాతీయ రహదారిపై వరికుంటపాడుకు వెళుతున్న ఆ ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపుతప్పడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో జార్ఖండ్‌కు చెందిన రమేష్, బీరసింగ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రకాశం జిల్లా పామూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలోకి కారు దూసుకెళ్లి ముగ్గురికి...


పొలంలో గేటు దిమ్మెను ఢీకొన్న కారు

జలదంకి, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం చినక్రాక వద్ద కావలి కాలువ సమీపంలో ఎన్‌హెచ్ 167బీజీ రహదారిపై సోమవారం సాయంత్రం రోడ్డుప్రమాదం జరిగింది. కావలి నుండి కలిగిరి వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి పొలంలోని గేటు దిమ్మెను ఢీకొంది. వెంటనే కారులో బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ముగ్గురు ప్రయాణీకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కావలి పట్టణంలో విద్యార్థిని కాలేజీలో చేర్పించి, తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన జరిగిన వెంటనే ఆ మార్గంలో వెళుతున్న వాహనదారులు గాయపడ్డ వెంకటేశ్వర్లు కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులను కారులోంచీ బయటికి తీసి, 108 వాహనంలో కలిగిరికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించుకుని గ్రామానికి తిరిగి వెళ్లారు. ఈ సంఘటనపై జలదంకి పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

మోటార్ స్టార్టర్ దగ్ధం

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని కట్టకిందపల్లి హరిజనవాడలో రక్షిత మంచినీటి పథకం మోటార్‌కు సంబంధించిన స్టార్టర్ సోమవారం తెల్లవారుజామున దగ్ధమైంది. స్టార్టర్ షార్ట్‌సర్క్యూట్ జరిగి దగ్ధమైందా లేదా ఎవరైనా కావాలని దగ్ధం చేశారా అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేసి పంచాయతీ కార్యదర్శి షేక్ నజీముల్లా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించి అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంచినీటి సమస్య తలెత్తకుండా కొత్త స్టార్టర్‌ను ఏర్పాటు చేశారు. కాగా, కాలనీలో జరుగుతున్న వరుస సంఘటనలపై ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని వారు కోరుతున్నారు.

కుమార్తె అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

మనుబోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తె (16) కనిపించడం లేదంటూ సోమవారం రాత్రి మందాటి గురవయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గురవయ్యకు ఇద్దరు పిల్లలు. కుమార్తె నెల్లూరులోని ఓ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతోంది. నెల రోజులుగా కళాశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో ఉదయం 10 గంటల సమయంలో పక్కవీధిలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని ఇంట్లోంచి వచ్చేసింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు వెతకడం ప్రారంభించారు. బంధువుల ఇళ్లతోపాటు, చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో గురవయ్య దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 545

ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు పూర్తిచేయాలి

కావలి,సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదపవని రోడ్డులో పుష్కరకాలంగా అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని వామపక్షాల నాయకులు కోరారు. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణవేదిక ఆధ్వర్యంలో సోమవారం వామపక్షాల నాయకులు కావలి ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. వంద గ్రామాలకు అవసరమైన ఆ వంతెన అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలోకి వలసలు పెరిగాయని, రోడ్లు, వంతెనలు లేకపోవటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తయిందని, రైల్వే శాఖ తన పరిధి వరకు వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసిందన్నారు.. ప్రస్తుతం ఉదయగిరి రోడ్డులోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై వాహనాల రద్దీ పెరిగి ఉందని, అది దెబ్బతింటే ఇక రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలు లేవన్నారు. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణవేదిక కన్వీనర్ కరువది భాస్కర్, సీపీఐ నాయకులు దామా అంకయ్య, సీపీఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, సీపీఎంఎల్ నాయకులు లక్ష్మిరెడ్డి, సీఐటీయూ నాయకులు క్రిష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చాలీచాలని తూములు .. నీళ్లు పారేదెలా?

● 3 నుంచి 1.5 అడుగులకు తగ్గించిన వైనం ● ఆందోళన చెందుతున్న రైతులు

కావలి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెరువు నీటి పారుదలకు చాలీ చాలని తూములు వేస్తే .. పొలాలకు నీళ్లు పారేదెలా? అంటూ కావలి మండలం చెంచుగానిపాలెం, ముసునూరు గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ముసునూరు చెరువు పాత గుడి తూము నీళ్ల పారుదల కింద అధికారికంగాను, అనధికారికంగాను సుమారు 1000 ఎకరాలకు చెరువు నీరు చేరాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వంలో పాత తూము వద్ద నీళ్ల లీక్ అవుతుండటంతో కొత్త తూము ఏర్పాటు కోసమని పాత తూమును పగలగొట్టి పనులు చేపట్టకుండా వదిలేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తూముల పనులు సత్వరం చేయించాలని అధికారులకు సూచించారు. దీంతో చెంచుగానిపాలెంకు చెందిన తాతా హరిబాబు సుమారు రూ. 5.5 లక్షలతో తూముల ఏర్పాటు పనులు చేపట్టాడు. అయితే అదే చెరువుకు సంబంధించిన ఇస్కనేల తూము, దిన్నెమీద తూముల పనులు చేపట్టేటప్పుడు గతంలో 2 అడుగుల తూములు వెయ్యబోగా, రైతులు అడ్డుకుని 3 అడుగుల ఖానాతో తూములు వేయించారు. కానీ కొత్తగా ఇప్పుడు పనులు చేపట్టిన ప్రధాన కాలువ తూము అయిన పాత గుడి తూమును మాత్రం 3 అడుగులు వెయ్యకుండా 1.5 అడుగుల తూము వేసి హడావిడిగా పనులు చేపట్టారని రైతులు చెబుతున్నారు. చెరువులోని చెత్తాచెదారం నీటి ప్రవాహానికి కొట్టుకువచ్చి తూముల్లో ఇరుక్కున్నట్లయితే నీరు పారదని, అధికార పార్టీ నేతలు హడావిడిగా రైతులకు తెలియకుండా చిన్న తూములు వేసి తూతూ మంత్రంగా పనులు చేపట్టారని రైతులు ఆరోపిస్తున్నారు. తూముల వద్ద నీటి సరఫరాకు లాకులు బిగిస్తారు కాబట్టి పెద్ద తూములు వేస్తే నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉంటుందని, నేతలు కాంట్రాక్టర్లుగా మారి స్వార్థంతో చిన్నపాటి తూములు వేసి 'మమ' అనిపిస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా చెరువు సంఘం అధ్యక్షుడు గానీ, మెంబర్లు గాని పట్టించుకోకపోవటం పలు అనుమానాలకు తావిస్తోందని ముసునూరు, చెంచుగానిపాలెం గ్రామాల రైతులు అంటున్నారు.


నిర్మాణంలో ఉన్న ముసునూరు చెరువు పాత గుడి తూము

నీటి పారుదలకు ఆటంకం ఉండదు

చిన్న తూము ఏర్పాటుతో నీటి సరఫరాకు ఇబ్బంది ఉండదు. ఎస్టిమేషన్‌లో అడుగు తూము ఉన్నప్పటికీ 1.5 అడుగు తూములు ఏర్పాటు చేశాం. దీంతో సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. - జంపాని కిరణ్, ఏఈ, ఇరిగేషన్

అధిక యూరియాతో పంటకు నష్టం


ర్యాలీలో పాల్గొన్న ఏవో శైలజ, రైతులు

బిట్రగుంట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అధికంగా యూరియా వాడటం వల్ల కలిగే నష్టాలను రైతులు తప్పనిసరిగా తెలుసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి శైలజ సూచించారు. సోమవారం బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల, కోవూరుపల్లి గ్రామాల్లో అధిక యూరియా వాడకంపై రైతులకు అవగాహన సదస్సులు ఆమె నిర్వహించారు. యూరియా అధికంగా వాడటం వల్ల చౌడు భూమిగా మారే ప్రమాదం ఉందన్నారు. పైరుకు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుందని వివరించారు. అనంతరం స్థానిక రైతులు, సచివాలయ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాటకరాణి శీనయ్య, ఎన్ రంగయ్య, ఎం గోపపీకృష్ణబాబు, కే సుబ్బారావు, కే సురేంద్ర, ఏఈవో పౌలు, వీపీఏ సుస్మిత, సూర్య, డిజిటల్ అసిస్టెంట్ శ్యాం సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

యూరియాను అధికంగా వినియోగించొద్దు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పంటలకు యూరియాను అధికంగా వినియోగించవద్దని ఏఓ శేషారెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నఅమ్మపాలెంలో సోమవారం యూరియా వినియోగంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమంలో ఏఓ శేషారెడ్డి మాట్లాడుతూ పంటలపై యూరియా అధికంగా వినియోగిస్తే కలిగే నష్టాలను వివరించారు. అనంతరం రైతులకు పిడిఎంఎస్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెన్నిబోయిన ఓబుల కొండయ్య, సిబ్బంది రఘువీర్‌యాదవ్, హరికృష్ణరెడ్డి, ఐసిఆర్‌పి ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

అన్నదాత పోరును జయప్రదం చేయాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కందుకూరులో మంగళవారం జరగనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల వైసీపీ కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహం, వైసీపీ జిల్లా రైతు వింగ్ ఉపాధ్యక్షుడు కట్టా హనుమంతరావు వేర్వేరు ప్రకటనలో కోరారు. మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రాళ్లపాడు నుంచి కలుషిత నీటి సరఫరా


పాచిపట్టిన రాళ్లపాడు ప్రాజెక్టు నీరు

గుడ్లూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలానికి రాళ్లపాడు రిజర్వార్ నుంచి విడుదల చేస్తున్న నీరు పాచిపట్టి పచ్చని రంగులో వస్తున్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రాళ్లపాడు ప్రాజెక్టు దగ్గర గుడ్లూరు మండలానికి వచ్చే ప్రధాన పైప్‌లైన్ లీకేజీ ఏర్పడి, వారం రోజులు నీటిసరఫరాను నిలిపిశారు. ఆతరువాత మరమ్మతులు చేసి నీటిసరఫరా చేస్తున్నా అవి మురికిపట్టి వాడుకునేందుకు సైతం పనికి రాకుండా ఉంటున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సురక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉలవపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని వీరేపల్లి జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహన చోదకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరేపల్లి ఎస్టీ యానాది కాలనీకి చెందిన యాకసిరి చెంచయ్య(39) కారు నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. సోమవారం రాత్రి తన కారుని ఇంటి దగ్గర పెట్టి హైవే మీద ఉన్న దాబాకు వెళ్లి తిరిగి కాలనీలోకి వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో చెంచయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. మృతుడు చెంచయ్యకు భార్య వరమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

స్పందించి.. సకాలంలో ఆస్పత్రిలో చేర్పించి...

మానవత్వం చాటుకున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

కావలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) రోడ్డుపై ఎవరైనా ప్రాణాయపాయ స్థితిలో పడి ఉంటే మనకెందుకులే.. అని చాలా మంది తమ దారిన తాము వెళ్లిపోతారు. అయితే రెడ్‌క్రాస్ ప్రతినిధులు మాత్రం మానవత్వంతో ఓ రోడ్డు ప్రమాద బాధితుడికి చేయూతనందించారు. కావలి-జలదంకి రోడ్డులో జమ్మలపాలెం సమీపంలో రోడ్డుపై ఒక వ్యక్తి ఆదివారం రాత్రి 10.15 గంటలకు తీవ్ర గాయాలతో పడి ఉండగా, అటు వైపు నుంచి వస్తున్న రెడ్‌క్రాస్ కోశాధికారి ఆరికట్ల మధుసూధనరావు, జీవితకాల సభ్యులు సూరే మదన్‌మోహన్‌రెడ్డి, బొట్లగుంట హరిబాబు, ఆశా రామమోహన్‌రావు గమనించారు. కావలికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ శ్రీనివాసులు స్కూటర్‌పై జలదంకి నుంచి వస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడడంతో ఆయన తలకు, కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే తమ వాహనంలో ఆయనను కావలికి తీసుకువచ్చారు. రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ ఏరియా వైద్యశాలకు చేరుకుని ప్రథమ చికిత్స అందేలా చొరవ తీసుకున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తలకు తీవ్రమైన గాయంతో పాటు, కాలి ఎముకలు విరగడంతో ప్రథమ చికిత్స అనంతరం బాధితుడిని తిరుపతి ఆసుపత్రికి తరలించారు. రాత్రి సమయంలో రెడ్‌క్రాస్ బాధ్యులు క్షతగాత్రుడిని సకాలంలో ఆసుపత్రికి తీసుకురావడంతో శ్రీనివాసులుకు ప్రాణాపాయం తప్పింది. దీంతో మానవత్వం చాటుకున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులను పలువురు అభినందించారు.


బాధితుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మదన్ మోహన్

11, 12 తేదీల్లో మైనంపాడులో విద్యార్థులకు పోటీలు


వలేటివారిపాలెం ఎంఆర్‌సీలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖాధికారులు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్ మోడల్‌స్కూల్, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న 9,10,11,12వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ఈ నెల 11, 12వ తేదీల్లో జిల్లా విద్యా శిక్షణ సంస్థ మైనంపాడు పాఠశాలలో మ్యూజిక్, డ్యాన్స్ తదితర పోటీలు జరుగుతాయని డైట్ కళాశాల లెక్చరర్ సంగా మహేంద్ర తెలిపారు. ఈమేరకు వలేటివారిపాలెం ఎంఆర్‌సిలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు మాల్యాద్రిరెడ్డి, మల్లికార్జునరావు, వలేటివారిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం కమల్‌కుమార్, పోకూరు హైస్కూల్ హెచ్‌ఎం రవీంద్ర, కేజీబీవీ ప్రిన్స్‌పాల్ గోవర్ధినీ, చుండి మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ శ్రీవెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ఎదురెదురుగా బస్సులు...

గంటసేపు స్తంభించిన ట్రాఫిక్

కావలి.సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సినిమాహాల్ రోడ్డులో సోమవారం సాయంత్రం రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా రావటంతో రోడ్డు చిన్నదిగా ఉండడంతో ఇరుక్కుపోయాయి. దీంతో గంట సేపు ట్రాఫిక్ స్థంభించింది. నిత్యం వాహనాల రాకపోకలు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. వ్యాపార దుకాణాలు కూడా వీధిలో ఉండడంతో లోడింగ్, అన్‌లోడింగ్‌కు వాహనాలు అక్కడికి వస్తూ ఉంటాయి. ద్విచక్రవాహనాలను దుకాణాల ముందు రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అక్కడ ఏ రెండు పెద్ద వాహనాలు ఎదురుపడినా ట్రాఫిక్ సమస్యలు తప్పటం లేదు. సోమవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో రెండు ఆర్టీసీ బస్సులు ఎదురుగా రావడంతో ట్రాఫిక్‌లో ఇరుక్కున్నాయి. క్లియర్ అయ్యేసరికి సుమారు గంట సమయం పట్టడంతో ప్రజలు, వాహనచోదకులు అవస్థలు పడ్డారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఎదురెదురుగా రావడంతో బస్సులు రావడంతో స్తంభించిన ట్రాఫిక్

115 గ్రామాలకు సురక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకోండి

● సబ్ కలెక్టరుకు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం వినతి

కందుకూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 115 గ్రామాలకు సురక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం సబ్ కలెక్టరు దామెర హిమవంశీని కలిసి విజ్ఞప్తిచేశారు. సోమవారం ఆయన కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి మండలి ప్రతినిధులతో కలిసి మంచి నీటి పథకాల దుస్థితిని సబ్ కలెక్టరుకు వివరించారు. రాళ్లపాడు రిజర్వాయరు ఆధారంగా గుడ్లూరు మంచినీటి పథకం, రాళ్లపాడు - రేళ్లపాడు, చుండి - చెర్లోపాలెం తాగునీటి పథకాలు పనిచేస్తున్నాయని, వీటిద్వారా 115 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోందని తెలిపారు. ఇటీవల ఈ మూడు పథకాల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత జలాలను పరీక్షలకై ల్యాబ్‌కు పంపించగా తాగునీరుగా ఎట్టిపరిస్థితుల్లో వినియోగించరాదని రిపోర్టు వచ్చిందని చెబుతూ ల్యాబ్ రిపోర్టులను సబ్ కలెక్టరుకు శివరాం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాళ్లపాడు రిజర్వాయరులో చేపలపెంపకం చేపడుతుండటంతో జలాలు కలుషితమవుతున్నాయని, సమస్యను పట్టించుకోవాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బాధ్యత మరిచి వ్యవహరిస్తున్నారన్నారు. ఈ మంచినీటి పథకాలను పరిశీలించి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టరుకు విజ్ఞప్తిచేశారు. అలాగే డివిజన్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను తనిఖీలు చేయడం ద్వారా పేద విద్యార్థులకు అన్నిసౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరగా సబ్ కలెక్టరు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో శివరాం వెంట అభివృద్ధి మండలి సభ్యులు పాలేటి కోటేశ్వరరావు, కాకుమాని మాధవరావు, తోకల వెంకటేశ్వర్లు, బూసి సురేష్‌బాబు, జిలానీ, దుర్గాప్రసాద్, ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.


సబ్ కలెక్టరు దామెర హిమవంశీకి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే శివరాం, అభివృద్ధి మండలి సభ్యులు

మానైతేనే... ప్రమాదం !

వలేటివారిపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల భవపాల గోడల శిథిలాల్లో ఓ మొక్క మొలిచింది. ఇది రోజురోజుకీ పెరుగుతోంది. దీంతో గోడలు, శ్లాబు దెబ్బతింటుంది. మొక్కే కదా అని అలాగే వదిలేస్తే మాను అయి వేర్లు దిగి కార్యాలయాల గోడలు, శ్లాబు దెబ్బతినే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రకృతి వ్యవసాయంతోనే చక్కటి ఆరోగ్యం

దగదర్తి (బిట్రగుంట) సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో చక్కటి ఆరోగ్యం సిద్ధిస్తుందని మోడల్ టీం లీడర్ హరిచందన తెలిపారు. సోమవారం దగదర్తి మండల పీహెచ్, తహసీల్దారు కార్యాలయాల వద్ద ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరకాయలు, ఆకుకూరలను విక్రయించే స్టాళ్లను ఏర్పాటు చేశారు. ప్రతిఒక్కరూ ఇంటి పెరట్లో కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవాలని హరిచందన తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వాటిని కొనుగోలు చేయాలన్నారు.


ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు, కూరగాయలు విక్రయిస్తున్న హరిచందన

నేత్రదానంతో అంధులకు చూపు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : నేత్రదానం చేస్తే అంధులకు చూపు ప్రసాదించవచ్చని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి పేర్కొన్నారు. సోమవారం వైద్య కళాశాల ప్రాంగణంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్రదానంపై అవగాహన లేక అనేక మంది తమ నేత్రాలను వృథా చేస్తున్నారన్నారు. అలాంటి వారికి మరణానంతరం నేత్రదానం చేస్తే వారికి కంటి చూపు ప్రసాదించవచ్చని తెలిపారు. ఇవన్నీ తెలిసినా కొందరు నేత్రదానం చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఇలాంటి వారికి నేత్రదానం ఆవశ్యకతను తెలియచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, నేత్రవిభాగం హెచ్‌వోడీ డాక్టర్ వసంత పాల్గొన్నారు.

ఏజీపీ పాఠశాలలో అసంపూర్తిగా ప్రహరీ నిర్మాణం

లింగసముద్రం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్ల ఎస్సీ కాలనీలోని ఏజీపీ పాఠశాలలో నాడు-నేడు 2 పథకం కింద అసంపూర్తిగా పలు నిర్మాణాలు చేశారు.దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.2022లో ఈ పథకం కింద పాఠశాలలో ప్రహరీ, బాతురూంలు, టాయ్‌లెట్స్ నిర్మాణ పనులకు రూ.23 లక్షలు మంజూరు చేశారు.అయితే ఈ నిధులలో రూ.10 లక్షలతో ప్రహరీ గోడ, బాతురూం, టాయ్‌లెట్స్, మంచినీరు అందించేందుకు కుళాయిలు, బోరు ఏర్పాటు చేశారు.అలాగే పాత తరగతి గదికి మరమ్మతులు చేశారు.అయితే ప్రహరీ గోడ అసంపూర్తిగా నిర్మించి, గేటు ఏర్పాటు చేయలేదు.దీంతో పాఠశాలల ఆవరణలోకి కుక్కలు, పందులు తిరుగుతుంటాయి.ఈ కారణంగా విద్యార్థులు భయపడుతున్నారు.అయితే బాతురూంలో నిర్మించిన మూత్ర విసర్జన చేసే పాత్రలు కొన్ని ఊడి కిందపడ్డాయి.దీంతో విద్యార్థులు మల మూత్ర విసర్జనకు బయటకు వెళుతున్నారు.అలాగే పాఠశాల ముందు బాగంలో నాపరాళ్లు వేసి వదిలేశారు.విద్యార్థులు ఈ రాళ్లు తట్టుకొని గాయపడుతున్నారు.అయితే అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిదులు మంజూరు చేయక పోవడంతో ఈ పనులు పూర్తి కాలేదు.పాఠశాలలో చదువుతున్న 35 మంది విద్యార్థులు తరగతి గది లోపల కొందరు, వరండాలో కొందరు చదువుతున్నారు.పాత తరగతి గదిని వినియోగంలోకి తెస్తే వరండాలోని విద్యార్థులను ఈ గదిలోకి మార్చవచ్చని కాలనీవాసులు చెబుతున్నారు.ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా మిగిలిన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.


మొగిలిచెర్ల ఏజీపీ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ

అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న మాలేపాటి

దగదర్తి (బిట్రగుంట): దగదర్తి చెరువుకట్టను ధ్వంసం చేసి నల్లతుమ్మ చెట్లను అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని టీడీపీ సీనియర్ నేత మాలేపాటి రవీంద్రనాయుడు, నీటి సంఘం అధ్యక్షులు సుధాకర్‌నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం దగదర్తి మండల తహసీల్దారు కృష్ణను కలిసి డీఆర్ చానల్ వాగు సర్వే నిర్వహించాలని మాలేపాటి సోదరులు, వడ్డే రమేష్‌నాయుడు ఆయనకు వినతి పత్రం అందజేశారు. చెరువులో అక్రమంగా నల్లతుమ్మ చెట్లు నరికే కట్టింగ్ మిషన్లను స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతలు భానుచందర్ నాయుడు, కంచర్ల కృష్ణ, వట్టిగుంట గోపాల్, వర్తినేని కృష్ణ, పేపర్ల సూరిబాబు, మారేళ్ళపాడు కృష్ణ, చెన్నూరు రమణమ్మ, మన్నూరు రమణయ్య, అంకబాబు, వెంకట్రావు, ప్రభాకర్, బాస్కర్ తది తరులు పాల్గొన్నారు.

అలరించిన 'నవదుర్గ' నృత్య రూపకం


చిన్నారులను అభినందిస్తున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజియన్ అధికారులు

కావలి (టౌన్), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ డే వేడుకల్లో భాగం స్థానిక పీఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో ఆదివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కావలి సంయుక్త నృత్య కళా నిలయం చిన్నారులు ప్రదర్శించిన 'నవదుర్గ' నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా కావలి విశ్రాంత మేనేజర్ చంద్రశేఖర్ మార్గదర్శకత్వంలో నాట్యాచారిణి లిఖిత పర్యవేక్షణలో చిన్నారులు శివ, తనుశ్రీ, వీక్షిక, భవిష్య, ద్రాక్షాయణి, యశశ్రీ, కృష్ణప్రియ, సాయిశ్రీ, దుర్గాపావని, ఖ్యాతి, దీక్షిత అద్భుతంగా నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. చిన్నారులను అతిథులు, బ్యాంకు ఉన్నతాధికారులు అభినందించారు.

లో ఓల్టేజీ సమస్య తీర్చడమే ధ్యేయం


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

బిట్రగుంట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల పరిధిలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్యను తీర్చడమే ధ్యేయంగా పని చేస్తున్నామని మండల విద్యుత్ అధికారి జడరాయ అన్నారు. విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో ఏర్పాటు చేసిన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం మండల టీడీపీ కన్వీనర్ ఎం నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చొరవతో మేజర్ పంచాయతీల్లో లో ఓల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ఏఈ మాట్లాడుతూ బోగోలు పంచాయతీలో నాలుగు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. అరవపాలెం, ఇబ్రహీంపేట, బేతనీపేటలో మరో మూడు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. వాటిని కూడా త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. విశ్వనాథరావుపేటలో లోడ్ డివైడ్ చేసి రెండు 100 కేవీ, 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎల్ సుధీర్ బాబు, స్థానిక నేతలు బీ ప్రభాకర్ రెడ్డి, నరసింహారావు, శేఖర్ నాయుడు, లైన్‌మెన్ బ్రహ్మయ్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

నెల్లూరు(విద్య), సెప్టంబరు 8(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ తమ సభ్యులు అహ్మద్‌హుస్సేన్ సేవా దృక్పథంతో రోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఒకరోజు అన్నదానం చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవిచంద్ర, నేతలు స్వర్ణ రమేష్ పాల్గొన్నారు.



శ్రీవారి సేవకు మళ్లీ సింఘాల్

జీపీడీకి శ్యామలరావు

గతంలో పని చేసింది: 2017 మే 6 నుంచి 2020 అక్టోబరు 4వ తేది వరకు.

టీటీడీ ఈవోగా మరోసారి అనిల్‌కుమార్ సింఘాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన టీడీపీ ప్రభుత్వంలో ఈవోగా నియమితులైనప్పటికీ వైసీపీ ప్రభుత్వంలోనూ ఏడాది పాటు ఈవోగా కొనసాగారు. మొత్తమ్మీద మూడున్నరేళ్ల పాటు ఈవోగా పనిచేశారు. 'నార్త్ఇండియన్‌గా ఉన్న సింఘాల్‌కు ఇక్కడ ఆచారాలు ఏం తెలుసు, ఎలా పనిచేస్తారు, ఏపీలో ఐఏఎస్ అధికారులు ఎవరూ లేరా' అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చినప్పటికీ ఆయన్ను ఈవోగా నియమిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని నాటి ప్రభుత్వం మార్చలేదు. అప్పటి సీఎం చంద్రబాబు పెట్టుకున్న నమ్మకానికి తగ్గట్టు టీటీడీ ఈవోగా మూడేళ్ల ఐదు నెలల పాటు పనిచేసిన సింఘాల్ అనేక సంస్కరణలు తీసుకొచ్చి అందరి ప్రశంసలు అందుకున్నారు.

సర్వదర్శన భక్తులకు స్లాటెడ్ టోకెన్లు

సామాన్య భక్తులూ అతితక్కువ సమయంలోనే శ్రీవారిని దర్శించుకోవాలనే తపనతో స్లాటెడ్ సర్వదర్శన (ఎస్ఎస్‌డీ) విధానాన్ని ప్రవేశపెట్టింది సింఘాలే. నేటికీ ఈ విధానం విజయవంతంగా సాగుతోంది. అలాగే గరుడవారధి ప్రారంభమైంది కూడా సింఘాల్ ఆధ్వర్యంలోనే. టీటీడీలో ఈ ఫైలింగ్ విధానానికీ శ్రీకారం చుట్టారు. ఆలయంలోని పురాతన మండపాలను ప్రతిఒక్కరు వీక్షించేలా మండపాలకు ఉన్న ఇత్తడి గ్రిల్స్‌ను తొలగించారు. కంపార్టుమెంట్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ రోడ్లపైకి వచ్చేది. దీనికి పరిష్కారంగా నారాయణగిరి పార్కులో సింఘాల్ ఆదేశాల మేరకు తొమ్మిది షెడ్లను నిర్మించారు. దీంతో ఎన్నో సౌకర్యాలతో కూడిన షెడ్లలో భక్తులు తమ సమయం వచ్చేవరకు వేచిఉంటున్నారు. ధ్వజస్తంభం వద్ద మూవింగ్ రూఫ్ నిర్మించారు. ముఖ్యంగా వివిధ ప్రాంతాల్లో ఆలయాల పరిరక్షణ, నూతన ఆలయాల నిర్మాణం, ఆధునికీకరణ వంటి వాటికోసం శ్రీవాణి ట్రస్టును ప్రారంభించారు.

ఇక, ప్రైవేట్ బ్యాంకుల్లో బంగారు, నగదు డిపాజిట్లు, శ్రీవారి ఆలయంలో ఇనుప వంతెన నిర్మాణం వంటి అతి తక్కువ విషయాల్లో మాత్రం సింఘాల్ విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీ ఈవో బదిలీ

తిరుమల-తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారి శ్యామలరావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ అనిల్ కుమార్ సింఘాల్ మళ్లీ ఈవోగా నియమితులయ్యారు. గతంలో మూడున్నరేళ్ల పాటు ఈయన టీటీడీ ఈవోగా పనిచేశారు. ప్రస్తుత ఈవో శ్యామలరావును జీపీడీ (పొలిటికల్)లో కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

టీటీడీ ఈవోగా పనిచేసింది: గతేడాది జూన్ 16వ తేది నుంచి ప్రస్తుతం బదిలీ అయ్యే వరకు.

సీఎం చంద్రబాబు ఏరికోరి టీటీడీ ఈవోగా తెచ్చుకున్న జె.శ్యామలరావు 15 నెలలకే బదిలీ కావడం టీటీడీ వర్గాల్లో విస్మయాన్ని రేకెత్తిస్తోంది. జీఏడీ (పొలిటికల్)లో కార్యదర్శిగా ఆయన్ను నియమిస్తూ సోమవారం బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. చంద్రబాబు సీఎం హోదాలో తొలిసారి తిరుమలకు రాకముందే.. అప్పటికి ఇన్‌చార్జి ఈవోగా ఉన్న ధర్మారెడ్డిని ప్రభుత్వం ఆగమేఘాలపై తప్పించి శ్యామలరావును నియమించింది. ఆ తర్వాతే సీఎం హోదాలో చంద్రబాబు తిరుమల వెళ్లారు. రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను ప్రక్షాళన చేస్తానని, ఆ ప్రక్రియ టీటీడీ నుంచే ప్రారంభిస్తానని ఆ సందర్భంగా చంద్రబాబు ప్రకటించారు. అయితే, టీటీడీ పరిపాలనలో సీఎం ఆలోచనలు, అంచనాలకు అనుగుణంగా పనిచేయడంలో శ్యామలరావు వెనకబడటంతో బదిలీ జరిగిందన్న ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది జనవరిలో తిరుపతి బైరాగిపట్టెడలోని వైకుంఠ ద్వారదర్శన టోకెన్ల జారీ కేంద్రాల వద్ద తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మృతి చెందగా, 40 మంది గాయపడిన సంగతి తెలిసిందే. ఆ ఘటనతో సీఎం చంద్రబాబు టీటీడీ అధికార యంత్రాంగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి నుంచే ఆయనలో టీటీడీ ఈవో పట్ల అసంతృప్తి మొదలైనట్టు సమాచారం. దానికి తోడు పలు ఇతర కారణాలూ తోడయ్యాయని టీటీడీ, రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

కొన్ని అంశాల్లో తనదైన ముద్ర

టీటీడీ ఈవోగా పనితీరులో పాలకమండలి నుంచి అసంతృప్తిని, ఆరోపణలను ఎదుర్కొన్న ఈవో శ్యామలరావు.. కొన్ని అంశాల్లో టీటీడీ పాలనపై తనదైన ముద్ర వేశారు. ఈవోగా బాధ్యతలు తీసుకున్న వెంటనే శ్రీవారి ప్రసాదాలకు వినియోగించే నెయ్యి నాణ్యతను అనుమానించి నమూనాలను ల్యాబ్‌కు పంపడం ద్వారా కల్తీ జరిగిందని గుర్తించారు. దాంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగిన వ్యవహారాలపై ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి భక్తుల్లో ఆవేదన, ఆగ్రహం పెల్లుబికాయి. శ్రీవారి ప్రసాదాలకు పూర్వపు రుచి, నాణ్యత తెప్పించడానికి కృషి చేసి సఫలీకృతులయ్యారు. సేంద్రియ ఉత్పత్తుల ఖరీదు ఎక్కువన్న సాకుతో ఆలయంలో అన్న ప్రసాదాలను గత ప్రభుత్వ హయాంలో కేవలం 5-6 వేల మందికి మాత్రమే అందించే వారు. ఆ ప్రసాదాల రుచి తగ్గడంతో భక్తుల నుంచీ విమర్శలు పెరిగాయి. దీనిపై దృష్టి పెట్టిన శ్యామలరావు సేంద్రియ పంట ఉత్పత్తుల స్థానంలో సాధారణ పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి వాడడం ద్వారా మునుపటి రుచిని తెప్పించారు. ఆలయంలో 20 వేల మంది భక్తులను వాటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. నిత్యాన్నదాన సత్రంలో కూడా నాణ్యతపై దృష్టి పెట్టారు. సరైన ముడిసరుకులు కొనడం లేదని గుర్తించారు. రిలయన్స్ మార్కెటింగ్ నిపుణుల సాయం తీసుకున్నారు. నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి సూచనలు తీసుకుని పాటించారు. దీంతో నిత్యాన్నదాన సత్రంలో కూడా అన్నప్రసాదాల రుచి, నాణ్యత పెరిగాయి. శ్రీవారి సేవ విభాగంలో కూడా భక్తులకు మెరుగైన సేవలందించేందుకు శ్రీవారి సేవకులకు శిక్షణ ఇప్పించేలా సంస్కరణలు తెచ్చారు. శ్రీవారి మాడవీధుల్లో భక్తులకు గోవింద నామాలు నుదుట పెట్టడం, ఐటీ విభాగంలో చాలా లోపాలను అరికట్టారు.

ఆ నిర్ణయాలపై..

వైసీపీ హయాంలో అడ్డదిడ్డంగా జరిగిన నియామకాలను రద్దు చేయడంలో శ్యామలరావు చురుగ్గా వ్యవహరించలేదని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఉదాహరణకు గత ప్రభుత్వంలో నిబంధనలు పాటించకుండా అర్హత లేని వ్యక్తిని ఏకంగా ఐటీ విభాగం జీఎంగా నియమించిన సంగతి తెలిసిందే. అతడిని ఈవో శ్యామలరావు ఐటీ జీఎం పోస్టు నుంచి తప్పించి మరో విభాగానికి బదిలీ చేశారు. నియామకమే అక్రమమైనప్పుడు తొలగించకుండా, కోర్టు కేసులు వస్తాయన్న సాకుతో విభాగం మార్చడం విమర్శలకు దారి తీసింది. అదే పోస్టులో గతంలో ఉండి వైసీపీ ముద్ర వేసుకున్న ఓ అధికారికి తిరిగి ఐటీ విభాగం జీఎం పోస్టు కట్టబెట్టారని బోర్డు అసంతృప్తి వ్యక్తం చేసి.. తొలగించాలని నిర్ణయం తీసుకుంది. దీనినీ చాలా ఆలస్యంగా అమలు చేశారన్న ఆరోపణలున్నాయి. ఇక, టీటీడీ బోర్డుతో సమన్వయ లోపం ఉన్నట్లు కొన్ని నెలలుగా ప్రచారంలో ఉంది. దీనిపై సీఎంకూ ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఇక, తాము తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో ఈవో తీవ్ర తాత్సారం చేస్తున్నారంటూ సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. దర్శనాల విషయంలో ఏఐ వినియోగం, అలిపిరి పాదాల మండపాన్ని రూ.8 కోట్లతో పునరుద్ధరించేందుకు ఓ దాత ముందుకు రాగా సకాలంలో స్పందించలేదని, టీటీడీ విద్యా సంస్థల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న లెక్చరర్లు, డ్రైవర్లను రెగ్యులర్ చేసేందుకు బోర్డు తీర్మానించినా అమలు ఆలస్యమయ్యేలా వ్యవహరించారని సభ్యులు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.


- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కూలీని ఉద్యోగిని చేశారు



'కూలి పనిచేస్తే కానీ పూట గడవదు. అలాంటి నన్ను మ్యాపింగ్‌లో సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగిని చేశారు. దీంతో మా పిల్లలకు తల్లికి వందనం రాలేదు. రేషన్‌కార్డు పోయింది. ప్రభుత్వ పథకాలు ఏవీ అందటంలేదు' అంటూ తిరుపతికి చెందిన శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తంచేశారు. ఈయనలా ఎందరో సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని తమ సమస్యలపై పీజీఆర్ఎస్‌లో వినతులిచ్చారు. అధికారులకు 238 అర్జీలు రాగా, అందులో 150 భూ సమస్యలకు సంబంధించినవే. 6

ఆలయ శుద్ధి అనంతరం భక్తులకు దర్శనం



సోమవారం వేకువన ఆలయ తలుపులు తెరుస్తున్న అర్చకులు, అధికారులు

తిరుచానూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం నేపథ్యంలో తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారి ఆలయాన్ని టీటీడీ అధికారులు ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. సోమవారం వేకువజామున గ్రహణం ముగిసిన తర్వాత ఆలయ ద్వారాలు తెరిచి శుద్ధి అనంతరం అర్చకులు అమ్మవారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులకు దర్శనం కల్పించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో తొమ్మిది మందికి జైలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో తొమ్మిది మందికి జైలు శిక్ష విధిస్తూ నాలుగో అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి తెలిపిన ప్రకారం.. తిరుపతిలోని దాదాపు 10 కూడళ్లలో పది రోజులుగా ట్రాఫిక్ పోలీసులు బ్రీత్ అనలైజర్ల ద్వారా తనిఖీలు చేపట్టారు. మద్యంతాగి వాహనాలను నడుపుతూ, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేశారు. వీరిలో 22 మందిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున రూ.2.20 లక్షల జరిమానా విధించారు. ఇందులో ఎక్కువ మోతాదులో మద్యం తాగడం, మళ్లీ మళ్లీ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్న వారిలో ఒకరికి నాలుగు రోజులు, మరో ఇద్దరికి రెండు రోజులు, ఆరుగురికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆరుగురు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

- 36 దుంగలు, లగేజీ వ్యాను, కారు, బైక్ స్వాధీనం

మంగళం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ అలిపిరి- చెర్లోపల్లె మార్గంలోని అటవీ ప్రాంతంలో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. 36 దుంగలు, ఐదు వేర్లను, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం అటవీ సిబ్బంది చైతన్య, కిషోర్‌తో కలిసి అలిపిరి నుంచి చెర్లోపల్లి వైపుగా కూంబింగ్ నిర్వహించారు. అరవింద్ ఐ ఆస్పత్రి సమీపంలో అటవీ ప్రాంతంలో కొన్ని వాహనాలు ఉండటాన్ని గమనించారు. సమీపించడంతో కొంతమంది పారిపోవడానికి ప్రయత్నించారు. వెంబడించి ఆరుగురిని పట్టుకున్నారు. వాహనాలను తనిఖీ చేయగా 27 ఎర్రచందనం దుంగలు లభించాయి. పరిసరాల్లో మరో 9 దుంగలు, ఐదు వేర్లు కనిపించగా స్వాధీనం చేసుకున్నారు. లగేజి వాహనం, కారు, మోటార్ సైకిల్‌ను సీజ్ చేశారు. పట్టుబడ్డ వారిలో ముగ్గురు కర్ణాటక, ముగ్గురు అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించారు. వాహనాలతో సహా పట్టుబడ్డ ఎర్రచందనం విలువ రూ.60లక్షలు ఉంటుందని టాస్క్‌ఫోర్సు అధికారులు తెలిపారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

జిల్లాకు మూడు పోలీసు జాగిలాలు

- నార్కోటిక్, గంజాలో శిక్షణ పొందిన వాటిని కేటాయించిన అధికారులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి, నార్కోటిక్‌లో శిక్షణ పొందిన మూడు జాగిలాలను తిరుపతి పోలీసు జిల్లాకు అధికారులు కేటాయించారు. ఇవి బెల్జియన్ మలినోయిస్ జాతి కుక్కలు. రాష్ట్రంలోనే తొలిసారిగా డ్యూయల్ శిక్షణ పొందిన జాగిలాలు రావడం తొలిసారి. ఏపీ ఇంటెలిజెన్సు అదనపు డీజీపీ ఆదేశాల మేరకు తిరుపతి పోలీసు జిల్లాకు జోనా, వేగా, సిరి పేర్లున్న జాగిలాలు కేటాయించారు. ప్రతి జాగిలం దాదాపు 10 నెలల పాటు డ్యూయల్ ట్రైనింగ్, నార్కోటిక్, గంజా ట్రాకింగ్‌లలో శిక్షణ పొందింది. ఈ మూడు జాగిలాలను వాటి నిర్వాహకులైన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జనందకుమార్, ఏఆర్ పీసీ తిమ్మయ్య, రావీన్ వర్మ, రెడ్డి ప్రకాష్, శ్రీనివాసులు సోమవారం ఎస్పీ హర్షవర్ధనరాజు వద్దకు తీసుకొచ్చారు. అవి ఎస్పీకి సెల్యూట్ చేయడం ద్వారా రిపోర్టు చేశాయి. అనంతరం వాటి ప్రత్యేకతల గురించి ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఈ మూడు జాగిలాలను తిరుమల బ్రహ్మోత్సవాలకు వినియోగించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎంటీవో రాజశేఖర్, ఎస్బీ సీఐ సాధిక్ అలి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ వద్ద రిపోర్టు చేసుకుంటున్న జాగిలాలు

వైసీపీ పాలనలో 'అమృత్' అధోగతి

- 20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ దినకర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాల కారణంగా తిరుపతి కార్పొరేషన్‌లో అమృత్ పథకం ఇప్పటికీ పూర్తి కాలేదని 20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. కేటాయించిన నిధుల మేరకు పనులు పూర్తికాకపోవడం దారుణమన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో 20 సూత్రాల కార్యక్రమాల అమలుపై ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. తిరుపతికి ప్రస్తుతం అమృత్ 2.0కింద మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగరంలో 1.58 గృహాలకు గాను ఇప్పటికీ 35శాతం ఇళ్లకు నీటి కుళాయిలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ సంక్షేమపథకాలపై ఆయన సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. సమగ్ర శిక్షణ, ఎన్టీఆర్ వైద్య సేవ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరుపతిలో పార్లమెంటు ఉప ఎన్నికలో దొంగ ఓట్లు, కొరమేనుగుంట తదితర ప్రాంతాల్లో కబ్జా అంశాలపై ఆరాతీశారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు(డబుల్ ఇంజన్ సర్కార్) కృషి చేస్తున్నాయన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో దిగజారిన ఆర్థిక పరిస్థితిని సీఎం చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు. రూ.7,417కోట్లతో కండలేరు నుంచి, రూ.2,800 కోట్లతో గండికోట నుంచి జిల్లాలో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటిని కుళాయిల ద్వారా అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, జేసీ శుభం బన్సల్, నగర పాలకసంస్థ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డాక్టర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న 20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్

తిరుమలలో లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్



లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

తిరుమల, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్, కార్పోరేట్ మాజీ లాబియిస్ట్ నీరా రాడియా, తెలంగాణ ఎమ్మెల్సీ దయానంద్ ఉన్నారు.

తిరుమలలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

తిరుమల, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలలో జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం పరిశీలించారు. మాడవీధుల్లోకి ప్రవేశించే మార్గాలను పరిశీలించారు. గరుడసేవ సమయంలో అదనంగా ఏర్పాటు చేయనున్న క్యూలైన్లపై స్థానిక పోలీసు అధికారులతో చర్చించారు. పలు సూచనలు చేశారు.

తనిఖీలు : పోలీసులు, విజిలెన్స్, బాంబ్‌స్క్వాడ్, రెవిన్యూ, ఫారెస్ట్, ఫైర్, విద్యుత్, హెల్త్ అధికారులు రెండు బృందాలుగా విడిపోయి అలిపిరి కాలినడక మార్గంలో తనిఖీలు చేశారు. 150 దుకాణాలను పరిశీలించి నిబంధనలను పాటించని 13 దుకాణాలకు నోటీసులు ఇచ్చారు. సీసీ కెమెరాలు లేని దుకాణ యజమానులను హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్న హాకర్లను అదుపులోకి తీసుకుని తిరుపతికి పంపారు. ఇలా ఉండగా అత్యవసర సమయాల్లో భక్తులకు సీపీఆర్ చేసే అంశంపై సోమవారం పోలీసు సిబ్బందికి తిరుపతి రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన డాక్టర్లు ప్రసాద్, ప్రతీత్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.



బ్రహ్మోత్సవాల్లో ఏర్పాటు చేయనున్న క్యూలైన్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ బాటగంగమ్మ ఆలయ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.39 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 27,410
తలనీలాలు సమర్పించినవారు: 9,656



వీధుల్లో భిక్షాటన చేస్తున్న బుర్రకథ కళాకారులు

బుర్రకథ అడ్డం తిరిగింది!

కాలప్రవాహంలో కొన్ని కళలు అంతరించిపోవడం, కొన్ని రూపాలు మార్చుకోవడం సహజం. ఒకప్పుడు పల్లెల్ని ఉర్రూతలూగించిన జానపద కళల్లో బుర్రకథ ఒకటి. ఒక ప్రధాన కళాకారుడు కథ చెబుతుంటే, ఇద్దరు వంత పలుకుతూ ఉంటారు. జిలుగు వెలుగుల దుస్తులు, తలపాగా, వాయిద్యాలతో వీరు కథను రక్తి కట్టిస్తారు. ప్రధాన కథ మధ్యలో వీరు చెప్పే పిట్టకథలకు జనం పగలబడి నవ్వేవారు. వేసవి కాలంలో ఊరుమ్మడిగా బుర్రకథలను చెప్పించుకునేవారు. కళాకారులకు ధన, ధాన్యాలిచ్చి సత్కరించేవారు. ఈ జానపద కళ.. జాతీయోద్యమంలో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంలో కీలక పాత్ర పోషించింది. కమ్యూనిస్టు పోరాటాల్లోనూ బుర్రకథది ప్రధాన భూమిక. గతం ఘనమే కానీ వర్తమానం మాత్రం బుర్రకథ కళాకారులకు దయనీయంగా మారింది. అందుకు సాక్ష్యమే ఈ చిత్రం. డక్కిలి మండలం వెంబులూరు హరిజనవాడకు చెందిన వెంకటయ్య దేశరాజుకథ, కళింగరాజుకథ, మరాటీలకథ, చంద్రబోస్, లక్ష్మమ్మ, చిన్నయ్య, గంగా కళ్యాణం, తాంబోజురాజు కథ, పసలబాలుడికథ వంటివి బుర్రకథలుగా చెప్పేవాడు. అనేక ఊళ్లలో ఈయనను పిలిచి కథలు చెప్పించుకునేవారు. ఒకప్పుడు ఆలయాల్లో, ఊరి కూడళ్లలో ఏర్పాటు చేసిన వేదికలమీదా కథలు చెప్పిన వెంకటయ్య ఇప్పుడు సైకిలేసుకుని ఊరూరా తిరుగుతున్నాడు. కథ చెప్పించుకునేవారు కరువవడంతో ఇల్లిల్లూ తిరిగి కథలోని ఒక పాటో, పద్యమో వినిపించి చేతులు చాస్తున్నాడు. ఇదే ఆయనకు కూడు పెడుతోంది. ప్రస్తుతం వెంకటగిరి 7వ వార్డు కోళ్ళ ఫారం వద్ద నివాసం ఉంటున్న ఇతను తన చిన్నాన్న కొడుకు పోలయ్యతో కలిసి ఇలా పల్లెలు తిరుగుతున్నాడు. 'సేద్యం పనులుంటే పల్లెలోనే కూలి దొరికేది.. ఇట్లా టవున్లలో తిరిగి నాలుగిళ్లు అడుక్కుంటేనే కడుపు నిండుతోంది' అని చెబుతున్నాడు వెంకటయ్య.

- వెంకటగిరి, ఆంధ్రజ్యోతి

పీజీఆర్ఎస్ వినతులపై ప్రత్యేక దృష్టి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 106 వినతులు వచ్చాయి. 9 కౌంటర్లు ఏర్పాటు చేసి, వినతులు స్వీకరించారు. ఎస్పీ నేరుగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, సీఐలు పాల్గొన్నారు.

పకడ్బందీగా మిషన్ సంకల్ప అమలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మిషన్ సంకల్ప కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సంకల్పపై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో జిల్లాలో సంకల్ప కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మహిళలు, ఆడపిల్లలపై సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై అవగాహన కల్పించడానికి ఈ నెల 12వ తేదీ వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ కృష్ణమంజరి, ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ వాసంతి, అధికారిణి సుధారాణి పాల్గొన్నారు.

బోల్తాపడ్డ కారు : తప్పిన ముప్పు



తిరుచానూరు, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి రేణిగుంట వైపు వెళుతున్న కారు సోమవారం వేకువజామున తిరుచానూరు హరిజనవాడ వద్ద హైవే నుంచి పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. మద్యం తాగి అతివేగంగా కారు నడిపినట్లు స్థానికులు చెప్పారు. డ్రైవర్ కారును అలాగే వదిలేసి వెళ్లిపోగా తిరుచానూరు పోలీసులు క్రేన్ సాయంతో వెలికితీశారు.

రేపు, ఎల్లుండి ఆర్చరీ, స్కేటింగ్ పోటీలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఈనెల 10న అండర్ 14, 17, 19 విభాగాలలో ఆర్చరీ, 11న తిరుపతి శ్రీనివాస క్రీడా సముదాయంలో అండర్ 11, 14, 17, 19 విభాగాలలో స్కేటింగ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు అర్హులని, ఆసక్తిగల బాలబాలికలు సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడి నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటర్ విద్యార్థులు పదవ తరగతి ఒరిజినల్ మార్కులిస్టు తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 9290502041(ఆర్చరీ), 9985533560(స్కేటింగ్)లను సంప్రదించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి.. మహాప్రభో!

● పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల మొర

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'వారాలుగా తిరుగుతూనే ఉన్నాం.. సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.. ఇప్పటికైనా దృష్టి పెట్టండి' అంటూ పలువురు అర్జీదారులు కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులకు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లావ్యాప్తంగా ప్రజలు హాజరై సమస్యలపై అర్జీలు అందజేశారు. మొత్తం 238 అర్జీలు రాగా, అందులో భూసమస్యలపై 150 వచ్చాయి. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రైసైకిల్, వీల్‌ఛైర్ అందజేశారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

ఎరువుల కొరత తీర్చాలని ధర్నా



రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నం పెంచులయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమల పేరుతో భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందే తప్పా వారి సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదన్నారు. యూరియా, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పింఛను కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా



అనారోగ్యం కారణంగా రెండేళ్ల నుంచి వెన్నెముక పని చేయడంలేదు. లేచి కూర్చునే పరిస్థితి కూడా లేదు. వికలాంగ పింఛను కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నా. మీరైనా దయుంచి ఇప్పించండి.

- రమేష్, మేదరపల్లి, ఎర్రావారిపాళెం మండలం

బిల్డర్ మోసం చేశాడు..న్యాయం చేయండి



అపార్టుమెంట్ నిర్మాణం కోసం మేము 15మంది తిరుపతికి చెందిన బిల్డర్ చెంచయ్యకు లక్షలాది రూపాయలు చెల్లించాం. సదరు బిల్డర్ నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌పై ఓ ప్రైవేటు బ్యాంకు నుంచి భారీ మొత్తంలో రుణం తీసుకున్నాడు. రుణం చెల్లించకపోవడంతో అపార్ట్‌మెంట్‌పై హక్కులు మావే అని బ్యాంకు వారు కోర్టుకు వెళ్లారు. బిల్డర్‌పై చర్యలు తీసుకుని, మాకు న్యాయం చేయండి.

- నారాయణస్వామి తదితరులు, తిరుపతి

పింఛను ఇప్పించండి



మా అబ్బాయి జశ్వంత్ అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితమయ్యాడు. లేచి నిలుచునే పరిస్థితి లేదు. ప్రస్తుతం రూ.6వేలు పింఛను వస్తోంది. రూ.15వేలు ఇప్పించి ఆదుకోండి.

- జశ్వంత్ తల్లిదండ్రులు, మద్దాలి, కోట మండలం

ఇళ్లు ఖాళీ చేయమంటున్నారు.. న్యాయం చేయండి



సర్వే నెంబరు 27/1లో 50ఏళ్లుగా 15 కుటుంబాలు కాపురముంటున్నాయి. ఇటీవల జాతీయ రహదారి విస్తరణ కోసం ఇళ్లు ఖాళీ చేయమని నేషనల్ హైవేవారు నోటీసులు ఇచ్చి ఇబ్బంది పెడుతున్నారు. పరిహారం, ఇంటి స్థలం ఇవ్వకుండా మేము ఎక్కడికి వెళ్లాలి. దయుంచి న్యాయం చేయాలని వరదయ్యపాళెం మండలం తొండూరు గ్రామ పంచాయతీ శ్రీహరికోట ఎస్సీ కాలనీవాసులు గోపి, భాస్కర్, రమేష్, యశోదమ్మ, వెంకటేష్ కలెక్టర్‌ను కోరారు.

గౌరవ వేతనం చెల్లించాలి

ఇమాం, మౌజన్లకు గౌరవ వేతనం చెల్లించాలని వైసీపీ నేతలు మహ్మద్ కాసీం, ఇమ్రాన్ తదితరులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత సెప్టెంబరు నుంచి గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

దోబీఘాట్ స్థలాన్ని పరిరక్షించండి

తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలో రజకుల కోసం కేటాయించిన దోబీఘాట్ స్థలం కబ్జాకు గురైందని సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కబ్జాదారులపై చర్యలు తీసుకుని స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.

బంగారు నగల దుకాణంలో చోరీ యత్నం

● యజమాని అప్రమత్తతో ఉడాయించిన ఇద్దరు మహిళలు
● ఒకరిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు



దుకాణంలో నగలను పరిశీలిస్తున్న మహిళలు



చోరీకి యత్నించిన మహిళను పట్టుకొని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం బజారువీధిలోని ఓ బంగారు నగల దుకాణంలో ఇద్దరు మహిళలు చోరీకి యత్నించారు. యాజమాని అప్రమత్తం కావడంతో పరారయ్యారు. వారిని స్థానికులు వెంబడించి ఒక మహిళలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణం బజారువీధిలో శ్రీనివాసులు అనే వ్యక్తి బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం ఇద్దరు మహిళలు గొలుసులు, పట్టీలు కావాలంటూ దుకాణానికి వచ్చారు. శ్రీనివాసులు గొలుసులు, పట్టీల సెట్‌ను వారి ముందు ఉంచాడు. గొలుసులను పరిశీలిస్తున్న మహిళలు తీరును గమనించిన శ్రీనివాసులుకు అనుమానం వచ్చింది. రెండు నెలల క్రితం ఇద్దరు మహిళలు దుకాణానికి వచ్చి గొలుసులు అపహరించుకుని వెళ్లారు. అయితే నిందితులను గుర్తించక ఫిర్యాదు చేయకుండా మిన్నకుండిపోయాడు. సోమవారం వచ్చిన మహిళలే గతంలో గొలుసులు అపహరించుకుని వెళ్లిన ఉంటారని భావించి, వారిని అనుక్షణం పరిశీలిస్తూ అప్రమత్తంగా వ్యవహించాడు. ఇది గమనించి సదరు మహిళలు వెంటనే దుకాణం నుంచి వెళ్లిపోతూ పరుగులు తీయగా శ్రీనివాసులు వారిని వెంబడిస్తూ కేకలు వేశాడు. సమీపంలోని రాజగోపాలపురంలో స్థానికులు ఒక మహిళను పట్టుకున్నారు. ఇంతలో అక్కడకు చేరుకున్న దుకాణ యజమాని శ్రీనివాసులు సమక్షంలో పోలీసులకు అప్పగించారు. ఇంకో మహిళ తప్పించుకోవడంతో ఆమె కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. కాగా, ఈ ఇద్దరు మహిళలు సత్యవేడులోని బంగారు దుకాణాల్లో చోరీకి పాల్పడినట్లు పోలీసులకు సమాచారం అందడంతో విచారణ చేపట్టారు.

డప్పు కళాకారులను ఆదుకోవాలి

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కుమార్‌రెడ్డి



డప్పు కళాకారుల సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు కుమార్‌రెడ్డి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : డప్పు కళాకారులను అన్ని విధాలా ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతిలోని ఏపీ ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల డప్పు కళాకారుల సంఘం నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3వేల పింఛను పెంచాలని కోరారు. కళాకారులకు భాషా సాంస్కృతిక శాఖ గుర్తింపు కార్డులు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ ప్రభుత్వపరమైన సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసులు, మురగారెడ్డి, పి.రెడ్డెప్ప, అంజయ్య, మురళి, సహదేవయ్య, వెంకటేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌డీఎస్ఎస్' పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయండి



సీజీఎం జె.రమణాదేవి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ పథకం పనులను లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని నిర్మాణాల విభాగం చీఫ్ జనరల్ మేనేజరు జె.రమణాదేవి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం అన్ని జిల్లాల నిర్మాణాల విభాగం అధికారులతో ఆమె సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో త్రీఫేజ్ లైన్లు లేని గ్రామాల్లో లైన్లు లాగి విద్యుత్ సరఫరాను మెరుగు పరిచే పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ పనులు పూర్తి చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి, ప్రజలకు, కుటీర, చిన్నతరహా పరిశ్రమలకు ఉపయోగ పడుతుందన్నారు. సమావేశంలో తొమ్మిది జిల్లాల ఈఈలు, డీఈఈలు ప్రాజెక్టుల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఫైర్ డిటెక్షన్ హెచ్చరికతో ఆగిన హౌరా ఎక్స్‌ప్రెస్

సూళ్లూరుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హౌరా నుంచి తిరుచిరాపల్లికి వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సోమవారం రాత్రి సూళ్లూరుపేట రైల్వే గేటు వద్ద ఆగిపోయింది. రాత్రి 7 గంటల సమయంలో హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సూళ్లూరుపేట స్టేషన్ దాటి తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న రైల్వేగేటు వద్దకు చేరుకోగానే రైలులో ఫైర్ సిస్టమ్ అలారం మోగింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ అత్యవసరంగా రైలు నిలిపివేశాడు. వెంటనే రైల్వే సిబ్బంది అక్కడికి చేరుకుని బోగీలన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎటువంటి సాంకేతిక లోపం లేదని నిర్ధారించిన తరువాత రైలు బయలుదేరింది. ప్రయాణికులు సిగరేట్ కాల్చి ఉంటారని, ఆ పొగకు ఫైర్ సిస్టం అలారం మోగి ఉండవచ్చునని రైల్వే సిబ్బంది అనుమానిస్తున్నారు. దాదాపు 15 నిమిషాలు రైలు ఆగిపోవడం, సిబ్బంది అన్ని బోగీల్లో తనిఖీలు చేపట్టడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

వ్యాను ఢీకొని ఒకరి దుర్మరణం



మృతిచెందిన అమరనాథరెడ్డి

చంద్రగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం తొండవాడ సమీపంలోని సర్వీసు రోడ్డులో వ్యాను ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం పైడిపల్లికి చెందిన అమరనాథరెడ్డి సోమవారం రాత్రి 10 గంటల సమయంలో శానంబట్ల నుంచి తిరుపతి వైపు వస్తున్నారు. అదేసమయంలో తిరుపతి నుంచి బెంగళూరు వస్తున్న వ్యాను ఢీకొంది. ఈప్రమాదంలో అమరనాథరెడ్డి(31)కి తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో తిరుపతి రుయాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిన వేదపారాయణదార్ పోస్టుల భర్తీ

● విమర్శల నేపథ్యంలో నిలుపుదలకు ఆదేశమిచ్చిన టీటీడీ

తిరుమల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో వేదపారాయణదార్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఆగిపోయింది. కేవలం ఓ ప్రాంతవాసులకు మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారనే విమర్శలు, ఫిర్యాదుల నేపథ్యంలో దాదాపు 700 పోస్టుల భర్తీని టీటీడీ రద్దు చేసింది. గత ప్రభుత్వానికి సానుభూతిపరుడిగా ముద్ర ఉన్న ఓ అధికారి తమిళులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ కొందరు బ్రాహ్మణులు సీఎంవోతో పాటు మంత్రి లోకేశ్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 11వ తేదీన ఇంటర్వ్యూలు జరగాల్సి ఉన్న క్రమంలో ఈ పోస్టుల వ్యవహారానికి రాజకీయ, ప్రాంతీయ రంగు పులుముకుంది. దీంతో పోస్టుల భర్తీని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు విశ్వసనీయమైన సమాచారం.

రూ.లక్షల విలువైన మందులు వృథా

● కాలం చెల్లడంతో డిస్పోజబుల్ కేంద్రానికి తరలింపు

డక్కిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన మందులు మట్టిపాలయ్యాయి. సకాలంలో వినియోగించుకోకపోవడంతో కాలం చెల్లిన మందులను వృథాగా పడేయాల్సి వచ్చింది. ఆదివారం అర్ధరాత్రి డక్కిలి ప్రభుత్వాస్పత్రి నుంచి మందులను తీసుకెళ్తున్న ట్రాక్టరును స్థానికులు గుర్తించి అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఈ విషయం తెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానిక వైద్యాధికారిణి బిందుప్రియాంకను వివరణ కోరగా.. అవి డక్కిలి ఆస్పత్రికి చెందిన మందులు కాదని, 104 ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన మందులని తెలిపారు. కాలం చెల్లిపోవడంతో రాపూరులోని డిస్పోజబుల్ కేంద్రానికి ట్రాక్టరు తీసుకెళుతుండగా కొంతమంది ఉద్దేశపూర్వకంగా రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ ఆర్ఎంపీ వైద్యుడు ఈ ఘటనను తప్పుదారి పట్టించేందుకు ప్రయతిస్తున్నారని, దీనిపై విచారణ చేపడతామని డాక్టర్ బిందుప్రియాంక చెప్పారు.



డక్కిలి ప్రభుత్వాస్పత్రి నుంచి మందులను తీసుకెళ్తున్న ట్రాక్టరు

ప్రబలుతున్న జ్వరాలు




తడ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు - స్థానిక ఎస్‌బీఐ ఎదురుగా సర్వీస్ రోడ్డుపై మురుగునీరు

తడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తడ మండలంలో జ్వరాలు ప్రబలుతున్నాయి. వాతావరణ మార్పులకు తోడు గ్రామాల్లో పారిశుధ్య లోపం జ్వరాలకు కారణమవుతోంది. ఒక రోజు వర్షం కురిస్తే... మరసటి రోజు చల్లటి గాలులు వీస్తుండగా, అంతలోనే విపరీతమైన ఎండ వేడిమితో జనం తంటాలు పడుతున్నారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి, దగ్గుతో అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా గ్రద్దగుంట, తడ, వాటంబేడు గ్రామాల్లో టైఫాయిడ్ కేసులు నమోదు అవుతున్నాయి. రోజుకు సుమారు 20నుంచి 25మంది జ్వరాలతో బాధపడుతూ తడ పీహెచ్‌సీకి వస్తున్నారు. ఇక ప్రైవేట్ ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఇదిలా ఉండగా గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. మురుగు రోడ్డపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జీవన ఎరువులపై రైతులకు అవగాహన

వాకాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలిపూడి రైతుసేవా కేంద్రంలో సోమవారం వ్యవసాయశాఖ అధికారిణి దీప ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డీఏపీ, జీవన ఎరువుల ఉపయోగాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో దీప మాట్లాడుతూ దమ్ములో ఘన రూప యూరియాను మొదటిసారిగా వేసుకుని, తదుపరి దశల్లో నానో యూరియాను పైరుపై పిచికారి చేసుకోవాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీలను పురుగుమందులతో కలిపి కూడా పిచికారి చేసుకోవచ్చని, తద్వారా రైతుకు ఖర్చు తగ్గుతుందన్నారు. రైతులు ఖరీఫ్ సాగును దృష్టిలో ఉంచుకొని నానో యూరియా, నానో డీఏపీ జీవన ఎరువులను వాడుకొని అధిక ఉత్పత్తులను పొందాలన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి పురస్కారం



నారాయణరావును అవార్డుతో సత్కరిస్తున్న ప్రముఖులు

కోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సీవీఎస్ నారాయణరావుకు ఆచార్య దేవోభవ పురస్కారం అందింది. హైదరాబాదులోని త్యాగరాయగాన సభలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పినాకిని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నారాయణరావుకు ఆచార్య దేవోభవ అవార్డు బహూకరించారు. ఈ మేరకు అచార్య కొలకనూరి ఇనాక్, మునగా రామమోహన్‌రావు, ఓరుగంటి కృష్ణవేణి తదితరులు జ్ఞాపిక, అవార్డుతో అభినందించారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం: బీటీఏ



మహిళా ఉపాధ్యాయులకు సభ్యత్వం ఇస్తున్న బీటీఏ నాయకులు

కోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాలకు ఊపిరిపోస్తామని బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. మండల పరిధిలోని చిట్టేడు, కేశవరం, కొండుగుంట ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం బీటీఏ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా బీటీఏ నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్సీని నియమించి 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. అదే విధంగా సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీటీఏ మండల అధ్యక్షుడు పేర్నాటి నాగరాజు, ప్రధాన కార్యదర్శి మట్టిగుంట శ్రీనివాసులు, ఐవీ రమణయ్య, సుబ్బారావు, ఏడుకొండలు, సుబ్రహ్మణ్యం, నాగరాజు, శంకరయ్య పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్దనరెడ్డి, రోహిణి సహకారంతో హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టిహకారాన్ని అందజేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, జరీనాబేగం, ధనుర్జ, శ్రీనివాసులు, మురళీ నాయుడు, రామ్మోహన్‌రావు, నవీన్ జయకుమార్, వెంకటేశ్వరరావు, ప్రభాకర్, నాగరాజు, కృష్ణారెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో హోమపూజలు



హోమ పూజల్లో భక్తులు

గూడూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయదుర్గాదేవి ఉపపీఠంలో సోమవారం రాహుగ్రస్త చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక హోమపూజలు జరిగాయి. శతభిషానక్షత్రం, పూర్వాభాద్రనక్షత్రం, దుర్గాత్రిశతి, లలిత అష్టోత్తరం, శక్తిమాల, రుద్రం, లక్ష్మీనరసింహస్వామి మూలమంత్రం, మహాగణపతి అష్టశక్తుల మూలమంత్రం, మంత్రంసహితం హోమపూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎరువుల కొరతను నివారించాలి

చిల్లకూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎరువుల కొరతను నివారించి రైతులకు సక్రమంగా సరఫరా చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎరువుల కొరతపై సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా యూరియా, డీఏపీ వంటి ఎరువుల కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు వ్యాపారులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శశికుమార్, రమేష్, నారాయణ, సునీల్, గోపాల్, వెంకటేశ్వర్లు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం

చిల్లకూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు అక్షరం ఆకృతిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వయోజన విద్య, సార్వత్రిక విద్య ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనసూయ, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, కామేశ్వరి, శ్రీనివాసులు, రవీంద్ర, రమణయ్య, లీల, నాగభూషణమ్మ, శేషారెడ్డి, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నెర్రికాలువలో వ్యర్థాల తొలగింపు

రైతులే ముందుకొచ్చి పనులకు శ్రీకారం



సూళ్లూరుపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వేలాది ఎకరాలకు సాగునీరందించే నెర్రికాలువ కాలుష్య కోరల్లో చిక్కుకొని వ్యర్థాలతో నిండిపోయిందని, పూడిక తీయించి పంటలకు నీరందేలా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఏడు గ్రామాల రైతులు పలుసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇక చేసేదేమి లేక గోపాల్‌రెడ్డిపాలెం, గొల్లలమొలువు, పల్లిపాలెం, కారిజాత, పాములమిట్ట గ్రామాలకు చెందిన రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి నెర్రికాలువలో పేరుకపోయిన వ్యర్థాలను తొలిగించేందుకు పూనుకున్నారు. గొల్లలములువు వద్దనున్న రైల్వే గేటు నుంచి యంత్రాల సాయంతో రైతులే దగ్గరుండి వ్యర్థాలను తొలగించి పూడిక తీయిస్తున్నారు. రైల్వేగేటు వద్దనుంచి చెంగాళమ్మ ఆలయ సమీపంలోని లెప్రసి కాలనీ వరకు పూడిక తీయించారు. అక్కడ నుంచి మురుగునీటితో పాటు బురద ఎక్కువగా ఉండడంతో పనులు ఆగిపోయాయి. పట్టణ డ్రైనేజీ నీటితో కాలువ నిండిపోయి ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో కాలువలో పూడిక తీయలేక పలుచోట్ల యంత్రాలు సైతం దిగబడిపోవడంతో పనులు ఆలస్యం అవుతున్నాయి. గత ఏడాది డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు నెర్రికాలువ పొర్లుకట్టకు గండ్లు పడడంతో సాగునీటి పారుదల పూర్తిగా ఆగిపోయింది. అలాగే సూళ్లూరుపేట పట్టణానికి చెందిన మురుగు నెర్రికాలువలోకి చేరి సాగునీరు కలుషితం అయింది. కాలువలో పూడిక తీయించి సాగునీరు అందేలా రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పంచాయతీరాజ్‌శాఖ విశ్రాంత ఈఈ గిరినాథ్ అన్నారు. సోమవారం స్థానిక సరస్వతీశిశు మందిరంలోని పేద విద్యార్థులకు ఫీజుల నిమిత్తం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గిరినాథ్ సహకారంతో రూ.37వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే పేదరికం నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. దాతలు అందిస్తున్న సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గిరినాథ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మురళీరెడ్డి, రమణయ్య, రవిచంద్రరెడ్డి, రియాజ్ అహ్మద్, మయూరి శ్యామ్ యాదవ్, రూపేష్‌రెడ్డి, వీరేంద్రనాథ్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ



విశ్వనాథ నాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో ఆదివారం జరిగిన గ్రామశక్తి పోలేరమ్మ ఘటోత్సవంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ విశ్వనాథ నాయుడు గాయపడటంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. సోమవారం వెంకటగిరికి చేరుకున్న ఆయనను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. అలాగే పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ మురళీకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర బ్లయిండ్స్ స్పోర్ట్స్ అసోషియేషన్ అధ్యక్షుడు పరుచూరి పెంచలనరసయ్య, లింగసముద్రం సొసైటీ అధ్యక్షుడు రంగినేని రాజా, టీడీపీ నాయకులు మురళీగౌడ్, సురేంద్ర, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు వేణు తదితరులు ఏఎంసీ చైర్మన్‌ను పరామర్శించారు.

క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేత

నాయుడుపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఏ సాగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో క్షయవ్యాధి గ్రస్తులకు నెల్లూరుకు చెందిన భాగ్యలక్ష్మి, కృష్ణయాదవ్ దంపతులు తమ కుమార్తె లాస్య పుట్టినరోజు సందర్భంగా సోమవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుబ్బారావు, సూపర్ వైజర్ రమణయ్య, రాజావిక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు: ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చలివేంద్రం వద్ద మోటారు సైకిల్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఓజిలి మండలం పాపిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన వినోద్ మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా చలివేంద్రం వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వినోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

ఫిజియో థెరపిస్టుకు సన్మానం

నాయుడుపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాధికాస్ వెల్‌నెస్ సెంటర్‌లో సోమవారం ప్రపంచ ఫిజియో థెరపి దినోత్సవం సందర్భంగా ఫిజియో థెరపిస్టు డాక్టర్ విజయమేరీని ప్రముఖులు సన్మానించారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ సుబ్బారావు, వరప్రసాద్, రమేష్, బందిల మోహన్, ప్రేమ్‌కుమార్, శేఖర్‌బాబు, రాధిక, శ్యామల, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

మా ఊళ్ల దగ్గర డంపింగ్ యార్డు వద్దు

చెత్త ట్రాక్టర్లను అడ్డుకుని స్థానికుల నిరసన



ఆందోళనకారులకు నచ్చచెబుతున్న పోలీసులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డును తమ గ్రామాల సమీపంలో ఏర్పాటు చేయవద్దంటూ పెరిమిటిపాడు, కొణ్ణంబట్టు, ఇసకపాలెం గ్రామస్తులు సోమవారం చెత్త ట్రాక్టర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. గత నెలలో కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ డంపింగ్ యార్డుకు కొణ్ణంబట్టు గ్రామ సర్వే నెంబరు 131లో 10 ఎకరాల భూమి కేటాయించారు. రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీకి సంబంధిత పత్రాలు, భూమిని సైతం అప్పగించారు. మున్సిపాలిటీలో పోగయిన చెత్తను ఆ భూముల్లో డంపింగ్ చేయడానికి వెళ్లిన ట్రాక్టర్లను వారం రోజుల క్రితం కూడా కొణ్ణంబట్టు, ఇసకపాలెం గ్రామస్తులు అడ్డగించి ఆందోళన చేశారు. మళ్లీ సోమవారం చెత్త ట్రాక్టర్లను అడ్డుకుని తమ ప్రాంతంలో చెత్తను వేస్తే ట్రాక్టర్లను పెట్రోలు పోసి కాల్చేస్తామంటూ నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న సీఐ మురళీకృష్ణ, తడ ఎస్‌ఐ కొండప నాయుడు సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామాల సమీపంలో భూములను డంపింగ్ యార్డుకు కేటాయించడం అన్యాయమని, పట్టణంలోని చెత్తను తీసుకొచ్చి తమ గ్రామాల వద్ద నిల్వ చేస్తే కాలుష్యం పెరిగిపోతుందన్నారు. పోలీసులు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా అంగీకరించలేదు. దీంతో పోలీసులు మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యను పిలిపించి ఆందోళన కారులతో పోలీసులు మాట్లాడించారు. రెండు రోజులు సమయం ఇస్తే కలెక్టర్ వద్దకు వెళ్లి సమస్యను వివరిస్తామని, అప్పటి వరకు ఇక్కడ చెత్త వేయవద్దని గ్రామస్తులు కోరారు. దీంతో మున్సిపల్ అధికారులు చెత్త ట్రాక్టర్లను తీసుకుని వెనుదిరిగారు.

పోలేరమ్మ జాతరకు పటిష్ఠ బందోబస్తు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పోలేరమ్మ జాతరలో పటిష్ఠ బందోబస్తు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఐ రమణ అన్నారు. సోమవారం స్థానిక పింజల వీరయ్య కళ్యాణ మండపంలో సీఐ మీడియాతో మాట్లాడుతూ వెయ్యి మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 8 ప్రత్యేక బృందాలు. 400పైగా సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా ఉంటుందన్నారు. పోలేరమ్మ ఆర్చి, పోలీస్ స్టేషన్ వద్ద కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామన్నారు. జాతరలో జూదాలు, డైమండ్ డబ్బాలు వంటివి పూర్తి నిషిద్ధమని స్పష్టం చేశారు. తిరుపతి, నాయుడుపేట, శ్రీకాళహస్తి నుంచి వచ్చే భక్తుల వాహనాలకు విశ్వోదయ కళాశాలలో, గూడూరు, రాపూరు, నెల్లూరు నుంచి వచ్చే వాహనాలకు కుమ్మరిగుంట వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా క్యూలైన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, ఎస్‌ఐ ఏడుకొండలు పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం



రథంలో ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

చిట్టమూరు, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాంలో జరుగుతున్న శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం రథోత్సవం కనుల పండువగా సాగింది. శ్రీవళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు రథాన్ని లాగి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మిరియాలు, ఉప్పు రథంపై చల్లి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే రథం ముందు పోలి టెంకాయలు కొట్టారు. రథోత్సవానికి భక్తులు భారీసంఖ్యలో రావడంతో గూడూరు డీఎస్పీ గీతా కుమారి, వాకాడు సీఐ హుస్సేన్ బాషా, చిట్టమూరు, వాకాడు, కోట ఎస్‌ఐలు చిన్న బలరామయ్య, నాగబాబు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులకు మల్లాం యూత్ ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆహ్వానం



వెంకటగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతకు విచ్చేయాని జిల్లా కలెక్టర్ వెంకటేశ్‌కు ఆలయ చైర్మన్ మురళీకృష్ణ, ఈవో శ్రీనివాసులురెడ్డి సోమవారం ఆహ్వానపత్రిక అందజేశారు.

16న మండల మీట్

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుణశేఖర్ తెలిపారు. అన్నిశాఖ అధికారులు పాల్గొనాలని కోరారు.

దివ్యాంగుల నిరసన

కోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. వెరిఫికేషన్ పేరుతో వైకల్య శాతం 90శాతం ఉన్నప్పటికీ 40శాతం వరకు తగ్గించి తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తిరుపతి కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, తహసీల్దారు జయ జయరావుకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల ఫెడరేషన్ మండల అధ్యక్షుడు వల్లమేటి సునీల్, ఉపాధ్యక్షుడు శంకర్, మహిళా అధ్యక్షురాలు చెల్లెమ్మ, కోటయ్య, శ్రీనివాసులు, హరీష్, సంధాని, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సందడి

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో సోమవారం కళాకారుల సందడి నెలకొంది. పోలేరమ్మ జాతరలో భాగంగా భద్రాచలం నుంచి వచ్చిన డోలు వాయిద్య కళాకారులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధిలో భాగస్వాములవుతాం



సమావేశంలో సమస్యలను వివరిస్తున్న వైద్యాధికారి డోమ్‌ప్రియారావు

కోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోటలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రి అభివృద్ధిలో భాగస్వాములవుతామని ఆరోగ్య సలహామండలి సభ్యులు, టీడీపీ నాయకులు హామీ ఇచ్చారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సాధారణ సమావేశం ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ అధ్యక్షతన సోమవారం జరిగింది. వైద్యాధికారి డోమ్‌ప్రియారావు పలు సమస్యలను సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదులకు ఫ్రీజర్ బాక్సును ఉచితంగా ఇస్తామని టీడీపీ నాయకుడు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అదేవిధంగా ఆస్పత్రి కాంపౌండ్ వాల్‌కు గేట్, మట్టి తోలకాలకు తనవంతు సహకారం అందిస్తామని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ ముందుకువచ్చారు. అదే విధంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఆస్పత్రి ఆవరణ వరకు రోడ్డుకు ఇరువైపులా వీధిలైట్లు వేయిస్తానని దిలీప్‌కుమార్ నాయక్ హామీ ఇచ్చారు. అలాగే కొత్త ఈసీజీ మిషన్ కొనుగోలు ప్రతిపాదనలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దారా ప్రమీల, బాలసుబ్రహ్మణ్యం, బాబు, వైద్యాధికారులు పృథ్వీరాజ్, డోమ్‌ప్రియారావు, ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్ పాల్గొన్నారు.

పంచాయతీ విభజనకు గ్రామస్తుల అంగీకారం

బాలాయపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిమిలి పంచాయతీలోని అంబలపూడి గ్రామాన్ని మరో పంచాయతీగా విభజించాలని అంబలపూడి గ్రామానికి చెందిన తేజేంద్ర వినతితో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో వినీల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ప్రజల అభిప్రాయాన్ని కోరుతూ ఓటింగ్ నిర్వహించగా 43 మంది అంగీకరించగా, తొమ్మిది మంది వ్యతిరేకించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దొరబాబు, డీటీ సందీప్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు పార్లపల్లి రఘునాథరెడ్డి, దుర్గా మునివెంకటేశ్వర్లు, మొరవనేని భాస్కర్, బాబురెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల పరిశీలన

కోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని శ్యామసుందరపురంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలను సోమవారం డైట్ లెక్చరర్ శ్రీనివాసులు పరిశీలించారు. ఎంఈవో మస్తానయ్యతో కలసి విద్యార్థుల సామర్థ్యాలను పర్యవేక్షించారు. అదేవిధంగా పాఠశాలలోని మరుగుదొడ్లు, వంటగదులు పరిశీలించారు. హెచ్‌ఎం రమణయ్యకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.